తీయరెవరూ నాచు..

కూర్మమా మన్నించు!!



సిరిపురంలోని వుడా చిల్డ్రన్ థియేటర్ ప్రాంగణంలో జంతువులు, పక్షుల ఉద్యానవనం నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. ఇక్కడ నిర్వహించే కార్యక్రమాలకు వచ్చే వారు ఈ పార్క్‌లోని కుందేళ్లు, బాతులు.. తాబేళ్లు, పావురాలు, వివిధ మూగజీవులను చూసి ముచ్చటపడేవారు. చిన్న పిల్లలు ఆసక్తిగా తిలకించేవారు. ప్రస్తుతం తాబేళ్లు తప్ప ఏమీ లేవు. ఇవి ఉన్న నీళ్లకుండీ కూడా దారుణంగా ఉంది. నాచుపట్టి అధ్వానంగా మారింది. అయినా దానిని శుభ్రం చేసే నాథుడే కరవయ్యారు. - ఈనాడు, విశాఖపట్నం

తలచినంతనే.. గగన తలాన!!




ఈనాడు, విశాఖపట్నం

జోరుగా విమానయానం

విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో విమానాల రాకపోకలు 6.8 శాతం పెరిగాయి. జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో మొత్తం 7.02 లక్షల మంది రాకపోకలు సాగించారు. గతేడాదితో పోలిస్తే ఇది 1.2 శాతం అధికమని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం (ఏపీటీపీఏ) అధ్యక్షుడు కుమార్‌రాజా, ఉపాధ్యక్షులు నరేశ్‌కుమార్, డీఎస్ వర్మ తెలిపారు.

ప్రస్తుతం విశాఖ విమానాశ్రయం నుంచి విజయవాడకు నేరుగా ఒకే సర్వీసు నడుస్తోంది. అది ఉదయం విశాఖ వచ్చి, రాత్రి విజయవాడకు బయలుదేరుతుంది. ఒకే సర్వీసు ఉండటంతో తరచూ రాజధాని ప్రాంతానికి వెళ్లే ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏపీటీపీఏ విజ్ఞప్తి మేరకు ఈ నెల 27 నుంచి విజయవాడకు మరో సర్వీసు నడపనున్నారు. ఈ నెలాఖరు నుంచి హైదరాబాద్, అహ్మదాబాద్‌లకు కొత్త సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం మలేసియా, థాయ్‌లాండ్‌కు విదేశీ సర్వీసులు నడుస్తున్నాయి. దుబాయ్‌కు నేరుగా సర్వీసు ప్రారంభమైతే ఉపయుక్తంగా ఉంటుందని ఏపీటీపీఏ ప్రతినిధులు భావిస్తున్నారు.

2024-25 రెండో త్రైమాసికంలో దేశీయ సర్వీసుల రాకపోకల వివరాలు..




ధరలు తగ్గించటానికి..


విమాన ప్రయాణ ధరలు తగ్గించడానికి దేశవ్యాప్త పాలసీ అమలుచేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఇటీవల ప్రకటించారు. అది అమలైతే ప్రయాణికుల సంఖ్య మరింత పెరుగుతుంది. దుబాయి విమానం నడపాలని ఎప్పటి నుంచో విజ్ఞప్తులు వస్తున్నాయి. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- రాజారెడ్డి, డైరెక్టర్, విశాఖ విమానాశ్రయం


అంతర్జాతీయ ప్రయాణాల వివరాలు ఇలా..



డీజీ యాత్ర: విశాఖ విమానాశ్రయంలో సెప్టెంబరులో డీజీ యాత్ర సదుపాయం ప్రారంభించారు. ఇది ముఖ గుర్తింపు సాంకేతికత (ఎఫ్‌ఆర్‌టీ) ద్వారా పనిచేస్తుంది. దీంతో చెక్ పాయింట్ల వద్ద ప్రయాణికులు సులభంగా ముందుకు వెళ్లేందుకు అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం 16 శాతానికి పైగా ప్రయాణికులు ఈ మార్గంలో వెళ్తున్నారు.



మూడేళ్లలో..



చదువుల తల్లిగా కనకమ్మ



వన్‌టౌన్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతనగరంలోని బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారు బుధవారం విద్యాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రకాల పుష్పాలతో యాగం నిర్వహించారు. నగరానికి చెందిన సింబయాసిస్ అధినేత ఒ.నరేష్‌కుమార్ పుష్పయాగానికి అవసరమైన పుష్పాలను సమకూర్చేందుకు రూ.55వేలు విరాళంగా అందజేశారు. పూజల్లో ఆలయ ఈఓ శోభారాణి, ఏఈఓ తిరుమలేశ్వరరావు, ఈఈ సిహెచ్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో నూనె ధరల తగ్గింపు



వ్యాపారులు, రైతుబజారు నిర్వాహకులతో సమీక్షిస్తున్న జేసీ మయూర్ అశోక్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: బహిరంగ మార్కెట్‌లో వంట నూనెల ధరలు భారీగా పెరగడంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా రైతుబజార్లలో తక్కువ ధరకు నూనెలను విక్రయించాలని జేసీ మయూర్ అశోక్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆయన రైతుబజార్ల నిర్వాహకులు, నూనె విక్రయ వ్యాపారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ట్రేడర్లు ధరలు తగ్గించి, వినియోగదారులకు రైతుబజార్ల ద్వారా అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా కొన్ని ప్రముఖ కంపెనీల నూనెలను ఎంతకు విక్రయించాలో స్పష్టం చేశారు. అలాగే... టమాటా కిలో రూ.50, ఉల్లిపాయలు రూ.32లకే విక్రయించాలని ఆదేశించారు.

విశాఖకు మరో మణిహారం

- ‘ఐటీ హబ్’ దిశగా కీలక అడుగు
- మంత్రి లోకేశ్ ‘టీసీఎస్’ ప్రకటనతో అంతటా హర్షం



ఈనాడు, విశాఖపట్నం: విశాఖ నగరాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు మరో కీలక అడుగు పడింది. తీరంలో మరో మణిహారం ఏర్పాటుకానుంది. దిగ్గజ సంస్థ టీసీఎస్(టాటా గ్రూపు) విశాఖలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. ‘టీసీఎస్’ ఏర్పాటు ద్వారా దాదాపు 10 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయని అంచనా. ఈ విషయాన్ని ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ‘ఎక్స్’ వేదికగా గురువారం ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజుల్లోనే ఐటీ రంగంలో కీలక పరిణామం చోటుచేసుకోవడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పొరుగు నగరాల్లో ఉద్యోగాలు: ఉత్తరాంధ్రతోపాటు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వేలాది మంది ఐటీ ఉద్యోగాలు చేస్తున్నారు. వారంతా హైదరాబాద్, బెంగళూరు, ముంబయి, పుణె, చెన్నై తదితర నగరాల్లో నెలకొల్పిన ఐటీ సంస్థల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఐటీ, పరిశ్రమలను ప్రోత్సహించేలా ప్రకటనలు చేయడంతో యువతలో ఆశలు రేకెత్తాయి. విశాఖలో ఐటీ సంస్థలు ఏర్పాటైతే సొంత రాష్ట్రంలోనే పనిచేయొచ్చనే ఆలోచనలో ఉన్నారు. వారి ఆకాంక్షకు అనుగుణంగా మంత్రి లోకేశ్ ప్రకటన చేయడంతో యువత సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో స్థలం: టెక్ మహీంద్ర, ఇన్ఫోసిస్ తదితర ఐటీ సంస్థలు నగరంలో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. రుషికొండ వద్ద హిల్-2, 3పై 10 లక్షల చదరపు అడుగుల స్థలం, కొత్త మిలీనియం టవర్‌లోని భవనాల్లో 3.5 లక్షల చదరపు అడుగుల ఖాళీ స్థలం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఐటీ పాలసీని తీసుకొస్తే మరిన్ని సంస్థలు అక్కడ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో పలు సాఫ్ట్‌వేర్ సంస్థలు, బీపీవో సేవల కంపెనీలు పెద్ద సంఖ్యలో నెలకొల్పడంతో చాలా మందికి ఉద్యోగ అవకాశాలు దక్కాయి. తరువాత వైకాపా ప్రభుత్వ నిర్ణయాలతో పలు అంకుర సంస్థలు విశాఖ నుంచి వెళ్లిపోయాయి. చాలా మంది ఉద్యోగాలకు దూరమయ్యారు. మంత్రి లోకేశ్ ప్రకటన ఉద్యోగార్థుల ఆశలకు ఊపిరి పోసింది.

గృహ నిర్మాణాల్లో జాప్యం చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: చిన్న చిన్న సమస్యలను సాకుగా చూపి గృహ నిర్మాణాల్లో జాప్యం చేయొద్దని, మనసు పెట్టి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులకు సూచించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, అర్బన్, గ్రామీణ పథకాల అమలు తీరుతెన్నులపై బుధవారం ఆయన గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో ఊహించని పురోగతి సాధించాలన్నారు. రోజుకు 90 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. గృహ నిర్మాణశాఖ పీడీ ఆళ్ల శ్రీనివాస్, ఏడీసీలు రమణమూర్తి, వర్మ, యూసీడీ పీడీ ఫణిరామ్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

5,289 దరఖాస్తులు.. రూ.105.78 కోట్ల ఆదాయం

మాధవధార, న్యూస్‌టుడే : ఉమ్మడి విశాఖ జిల్లాలో మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరుగుతోందని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 11 వరకు గడువు ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 331 దుకాణాలు ఉండగా, బుధవారం రాత్రి 9 గంటల వరకు 5,289 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తు ఫీజు కింద రూ.105.78 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందన్నారు.

పోటాపోటీ...: మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు కొందరు రాజకీయ నాయకులు తమ బినామీల పేర్లతో దరఖాస్తులు సమర్పిస్తున్నారు. విశాఖ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న దుకాణాలకు వ్యాపారుల నుంచి పోటీ పెరిగింది. మొత్తం 155 దుకాణాలకు సంబంధించి మంగళవారం రాత్రి వరకు కేవలం 1,122 దరఖాస్తులు మాత్రమే అందాయి. బుధవారం ఒక్కరోజే 1,271 దరఖాస్తులు వచ్చాయి. ఎక్కువ వ్యాపారం జరిగే 14 దుకాణాలకు సంబంధించి 340కు దరఖాస్తులు వచ్చాయి. 32వ నంబరు గల షాపునకు 31 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

ముందుకొస్తున్న ఔత్సాహికులు: మొదట్లో కొన్ని చోట్ల రాజకీయ నాయకులు సిండికేట్లుగా ఏర్పడి, ఇతరులను దరఖాస్తు చేయకుండా అడ్డుకున్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి... మద్యం టెండర్లు వేసే వారిని అడ్డుకుంటే సహించేది లేదని హెచ్చరించింది. దీంతో దరఖాస్తులు వేసే వారి సంఖ్య నెమ్మదిగా పెరిగింది. మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతుండడంతో... ఎవరు దరఖాస్తు చేశారన్నది బయటకు తెలిసే అవకాశం లేదు. కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులూ దరఖాస్తులు ఇచ్చారని ఎక్సైజ్ సిబ్బంది చెబుతున్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తులకు 11 వరకు గడువు

ఇదీ లెక్క (బుధవారం రాత్రి 9 గంటల వరకు..)

జిల్లా	దుకాణాలు	దరఖాస్తులు
విశాఖ	155	2393
అనకాపల్లి	136	2100
అల్లూరి	40	796
మొత్తం	331	5,289

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : విశాఖ జిల్లాలో 2024-25 సంవత్సరానికి సంబంధించి 9, 10, ఇంటర్మీడియట్ చదువుతున్న బీసీ, ఈబీసీ,

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థులు పీఎం యశస్వి పథకం కింద ఉపకార వేతనానికి ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి కె.శ్రీదేవి తెలిపారు. దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, పాఠశాల/కళాశాల ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. వార్షికాదాయం రూ.2.50 లక్షలకు మించకూడదన్నారు. ఇతర వివరాలకు **sholarships.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

పోస్టుమెట్రిక్‌కు..: విశాఖ జిల్లాలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి ఫ్రెష్, రెన్యువల్ విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ డి.డి. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ కళాశాల యాజమాన్యంతో సంప్రదించి, కళాశాల జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలుంటే సంబంధిత కళాశాలలో, స్థానిక సచివాలయంలో, సంక్షేమశాఖ కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

గంజాయి, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
ఎస్పీల సమావేశంలో డీఐజీ గోపినాథ్ జెట్టి





ఈనాడు, విశాఖపట్నం: గంజాయి రవాణా, సైబర్ నేరాల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీలకు డీఐజీ గోపినాథ్ జెట్టి సూచించారు. విశాఖ రేంజి కార్యాలయం నుంచి ఐదు జిల్లాల ఎస్పీలతో బుధవారం నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. రేంజి పరిధిలో ఎక్కడా గంజాయి సాగు లేకుండా చూడాలని, వాటిని పండించే రైతులు జీవనోపాధికి ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు 'సంకల్పం' అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అక్రమ రవాణాలో తరచూ పట్టుబడిన వారిపై పీడీ చట్టం ప్రయోగించాలన్నారు. దీపావళి నేపథ్యంలో బాణసంచా విక్రయించే దుకాణాలు, గోదాములు తనిఖీలు చేసి భద్రతాప్రమాణాలు పాటిస్తుందీ లేనిది గుర్తించాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు.

సైబర్ నేరాలపై 1930 ఫిర్యాదు చేయాలి: సైబర్ నేరాలను నియంత్రించడంలో భాగంగా ప్రజలకు వాటిపై అవగాహన కల్పించాలన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేసేలా ప్రచారం చేయాలన్నారు. బాలికలు, బాలురు అదృశ్యం కేసుల్లో అలసత్వం ప్రదర్శించకుండా కేసు నమోదైన వెంటనే వారి ఆచూకీ కనిపెట్టేలా ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఎస్పీలను ఆదేశించారు. సమావేశంలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలు దీపిక, అమిత్‌బర్దార్, వకుల్ జిందాల్, కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్వీ మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసు కమిషనరేట్ పరిపాలనాధికారిగా చంద్రశేఖర్

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నగర పోలీసు కమిషనరేట్ కార్యాలయ పరిపాలనాధికారి(ఎ.ఒ.)గా వై.చంద్రశేఖరరావును నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పోలీసు కార్యాలయాల ఎ.ఒ.లను బదిలీ చేస్తూ డి.జి.పి. ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో విశాఖ పోలీసు కార్యాలయ ఎ.ఒ.గా విధులు నిర్వహిస్తున్న ఎస్.రామనారాయణరెడ్డిని ఒంగోలు పోలీసు ట్రైనింగ్ సెంటర్ ఎ.ఒ.గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఈ.గో. జిల్లా పోలీసు కార్యాలయ ఎ.ఒ.గా పనిచేస్తున్న చంద్రశేఖరరావును కేటాయించారు.

కోఆర్డినేటర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్ సెంటర్(ఎన్‌ఈఎల్‌ఎస్) కోఆర్డినేటర్ పోస్టు భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆంధ్ర వైద్యకళాశాల(ఏఎంసీ) ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు ఈనెల 18 తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను ఏఎంసీ పరిపాలన భవనంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు ఏఎంసీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ముగిసిన ఎ.పి.డాక్టర్స్ టేబుల్‌టెన్నిస్ పోటీలు



గెలుపొందిన ట్రోఫీలతో క్రీడాకారులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : ఎంవీపీకాలనీలో ఎస్-3 ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఎ.పి.డాక్టర్ల టేబుల్‌టెన్నిస్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ట్రోఫీల్లో మహిళల సింగిల్ అండర్-35 విభాగంలో డాక్టర్ సరజిత ప్రథమ, డాక్టర్ అర్షియ ద్వితీయ, 36-45 విభాగంలో డాక్టర్ శైలజ ప్రథమ, డాక్టర్ సమీనా ద్వితీయ, 46 సంవత్సరాలు పైబడిన విభాగంలో డాక్టర్ అరుణ ప్రథమ, డాక్టర్ సుజాత ద్వితీయ, డబుల్స్ విభాగంలో అర్షియ, సహస్ర జోడీ ప్రథమ, సరజిత, జమీలా జోడీ ద్వితీయ, పురుషుల సింగిల్స్‌లో డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ రాజశేఖర్‌లు తొలి రెండు స్థానాల్లో నిలిచారు. 36-45 విభాగంలో డాక్టర్ ఆర్‌వీఆర్.మూర్తి, డాక్టర్ ఎ.సతీష్, 45 ఏళ్ల పైబడిన విభాగంలో డాక్టర్ రామానుజం, డాక్టర్ ఎ.స్వాంతౌమాలు తొలి రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. డబుల్స్‌లో డాక్టర్ సార్వభౌమ, డాక్టర్ పణిశేఖర్ జోడీ ప్రథమ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అశోక్ జోడీ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు జిల్లా టేబుల్‌టెన్నిస్ సంఘం కార్యదర్శి డి.వి.ఎస్.వై.శర్మ, టెక్నికల్ కమిటీ మాజీ ఛైర్మన్ పి.వి.ఎన్.సూర్యారావులు ట్రోఫీలు అందజేశారు.

చేపలరేవులో మునిగిన బోట్ల వెలికితీత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: చేపల రేవులోని వివిధ జెట్టీల్లో మునిగిపోయిన బోట్లు, ట్రాలర్లను వెలికితీసే పనులను విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ)శ్రీకారం చుట్టింది. రూ.1.20 కోట్ల ఖర్చుతో ఆయా పనులను చేపట్టారు. గత నెల 11 నుంచి మొదలైన వెలికితీత పనులు చురుకుగా సాగుతున్నాయని పోర్టు అథారిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. చేపలరేవు ఉన్నతీకరణలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. కొన్నేళ్లుగా మునిగిపోయిన బోట్లు, ట్రాలర్లు చేపలరేవు జెట్టీల్లో శిథిలాలుగా మారిపోయాయి. దీనివల్ల బోట్లు కదలిక, రక్షణపై ప్రభావం పడుతోంది. వీటిని తొలగించేందుకు అధిక సామర్థ్యం కలిగిన జనరేటర్, కంప్రెసర్‌లను వినియోగిస్తున్నట్లు వీపీఏ కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. వచ్చే డిసెంబరు నాటికి ఆయా పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు.



క్రేన్ సహాయంతో బోటును వెలికితీస్తున్న దృశ్యం

'ఉక్కు' పునరుద్ధరణ ప్యాకేజీకి కృషి : ఎంపీ



పోరాట కమిటీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు రివైవల్ ప్యాకేజీ (పునరుద్ధరణ ప్యాకేజీ) కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తున్నామని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. బుధవారం ఉక్కు పోరాట కమిటీ నాయకులు ఆయన్ను కలిసి దిల్లీలో జరిగిన పరిణామాలపై ఆరా తీశారు. నవంబరు మొదటి వారంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరోసారి సమావేశమై ఆర్థికపరమైన అంశాలపై చర్చిస్తారని ఎంపీ తెలిపారు. అనంతరం కార్మిక నాయకులు వివిధ అంశాలను ఎంపీ దృష్టి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్, జె.అయోధ్యరామ్, వి.శ్రీనివాసరావు, వి.రామ్మోహన్‌కుమార్, బి.పైడిరాజు, గణపతిరెడ్డి, జె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్‌డ్	199	230
స్కిన్‌లెస్	226	240

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - శ్వాగ్

పెందుర్తి

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా పరవాడ బొంకులదిబ్బలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి ప్రారంభించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. 40 మంది మహిళలు పాల్గొన్నారు. పోటీల్లో జి.భాగ్యవతి(ప్రథమ), కె.తులసి(ద్వితీయ), పి.లక్ష్మి(తృతీయ), కె.ప్రణీత(4వ స్థానం) పి.రాము(5వ స్థానం) విజేతలుగా నిలిచారు. వీరికి ఈనెల 12న బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేడు నేస్తాలమ్మ పండగ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం నాయుడుపాలెం, వాడచీపురుపల్లి పంచాయతీ ప్రజల ఆరాధ్య దేవత నేస్తాలమ్మ అమ్మవారి పండగను గురువారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం అమ్మవారి అనుపోత్సవం, రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

న్యూస్‌టుడే, సబ్బవరం

సమస్య: సబ్బవరం మండల కేంద్రం సాయినగర్ కాలనీలోని 80 అడుగుల రోడ్డులో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలు ముసురుతున్నాయి. అధికారులు స్పందించి తొలగించేలా చూడాలి.
- పి.కోటేశ్వరరావు, సాయినగర్ కాలనీ

సమాధానం: సిబ్బందిని పంపి వ్యర్థాలను తొలగించే ఏర్పాటు చేస్తాం.- దెడ్డం ప్రసాదరావు, సర్పంచి సబ్బవరం

మట్టి వ్యాపారం.. మూడు లోడులు.. ఆరు కాసులు

పట్టించుకోని రెవెన్యూ, గనులశాఖ అధికారులు

వేపగుంట, న్యూస్‌టుడే

కొండలు, ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు కొంతమందికి అక్రమ తవ్వకాలు గుర్తొస్తాయి. కొంత ప్రాంతం వరకే మట్టి తవ్వకాలకు అనుమతులు తీసుకుని ఆ తర్వాత ఇష్టారాజ్యంగా నిబంధనలను బేఖాతరు చేస్తూ భారీగా తవ్వకాలు జరిపి పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. నియంత్రించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో మట్టి వ్యాపారం మూడు లోడులు.. ఆరు కాసులుగా ఉంటోంది. నగర శివారు వేపగుంట, పొర్లుపాలెం, నరవ ప్రాంతాల్లో విచ్చలవిడిగా అక్రమతవ్వకాలు జరుగుతున్నాయి. గ్రామస్థులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. పొర్లుపాలెం మాజీ ఉప సర్పంచి గళ్లా రమణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని సర్వే నెంబరు 75లో ఓ వ్యక్తి తవ్వకాలకు రెవెన్యూ, గనుల శాఖ అధికారులు 3.31 హెక్టార్లలో అనుమతులు ఇచ్చారు. అతను అనుమతులు తీసుకున్న దానికంటే ఎక్కువ ప్రాంతంలో


పొర్లుపాలెం కొండపై తవ్వకాలు జరిపిన ప్రాంతం

తవ్వకాలు జరపడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందంటూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని గళ్ల రమణ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఫిర్యాదు చేశానని చెబుతున్నారు.

సర్వే చేసి అపరాధ రుసుం విధించినా..

గనులశాఖ అధికారులు స్పందించి ఇటీవల తవ్వకాలపై సర్వే చేశారు. అనుమతులు ఇచ్చిన దానికంటే ఎక్కువగానే మట్టి తరలించినట్లు నిర్ధారణకు వచ్చారు. తవ్వకందారుడికి రూ.కోటి 55 లక్షలు సీనరేజ్ ఫీజులు చెల్లించాలని ఆదేశించారు. ఆ జరిమానా చెల్లించిందీ లేనిదీ అధికారులకే తెలియాలి. సర్వే కూడా సక్రమంగా చేపట్టలేదని కేవలం అనుమతులు ఇచ్చిన ప్రదేశంలోనే కొలతలు తీశారు తప్ప బయట తవ్వకాలు జరిపిన ప్రాంతంలో ఎందుకు సర్వే చేయలేదని అధికారులను రమణ ప్రశ్నించారు. తాము అనుమతులు ఇచ్చిన ప్రదేశంలో ఎంతమేర అక్రమంగా తవ్వకాలు జరిపారో చూస్తామని, మిగిలినది రెవెన్యూ అధికారులే చూడాలని ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ లేఖలు రాసుకుంటున్నారని రమణ పేర్కొన్నారు. వాస్తవంగా అనుమతులు ఇచ్చిన దానికంటే సుమారు 30 హెక్టార్లలో ఐదు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని అక్రమంగా తరలించారని ఆరోపించారు. దీంతో ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం చేకూరుతోందని ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మంగళగిరిలో ఎమ్మెల్యే వినతుల స్వీకరణ

పెందుర్తి, వేపగుంట, న్యూస్‌టుడే: జనసేన పార్టీ నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమంలో భాగంగా బుధవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పాల్గొన్నారు. పలువురు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యలను నమోదు చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. నెలలో ఒకసారి పంచకర్ల ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

శ్రీవారి సేవలో సరస్వతి నృత్య కళా పీఠం బృందం

వేపగుంట, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాయుడుతోట సరస్వతి నృత్య కళాపీఠం విద్యార్థినులు పాల్గొని కూచిపూడి నృత్యం చేశారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పిలుపురావడంతో శిక్షకురాలు కె.బాలసరస్వతి సారథ్యంలో బృంద సభ్యులు 20 మంది అక్కడకు వెళ్లి బుధవారం శ్రీవారి రథం వెనుక మాడ వీధుల్లో నృత్యం చేసి భక్తులను అలరించారు. నిర్వాహకులు వీరిని సత్కరించారు.


తిరుమల మాడ వీధుల్లో నృత్యం చేస్తున్న సరస్వతి నృత్య కళా పీఠం విద్యార్థినులు

వరి పొలాల్లో ఆకుముడత తెగులు గుర్తింపు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలంలోని ఎస్‌ఆర్‌పురం, ముదపాక, సరిపల్లి, గుర్రమ్మపాలెం తదితర గ్రామాల్లోని వరిపంటలో శాస్త్రవేత్తలు ఆకుముడత, పాముపొడ తెగులు గుర్తించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు బుధవారం ఆయా గ్రామాల్లో క్షేత్ర సందర్శన చేశారు. వరి పంటలో తెగుళ్ల నివారణ రైతులు పిచికారీ చేయాల్సిన మందులను వివరించారు. వంగ, టమాటా, బీర, మామిడి పంటల్లో చేపట్టాల్సిన ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.శ్రీలత, ఆర్.సరిత, హరిశ్చంద్ర, పెందుర్తి వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


సరిపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు


జెడ్పీ సీఈవో నారాయణమూర్తిని సన్మానిస్తున్న ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు, ఉద్యోగులు

సంక్షేమ పథకాల అమలుపై ఆరా..!

పెందుర్తి, న్యూస్‌టుడే: జడ్పీ సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన నారాయణమూర్తి బుధవారం పెందుర్తి మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆయనను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ గుండు అప్పలరాజు, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పన

వేపగుంట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవీఎంసీ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పన పనులు ఊపందుకున్నాయి. జీవీఎంసీ 93వ వార్డు గొల్లనారాయణపురంలో సామాజిక భవనం నుంచి పోలిపల్లమ్మ అమ్మవారి ఆలయం వరకు రూ.30 లక్షలతో సిమెంటు రహదారిని నిర్మిస్తున్నారు. ఆయా పనులను కార్పొరేటర్ రాపర్తి కన్నా, వార్డు తెదేపా కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. పనుల్లో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా నాణ్యతతో చేయాలని గుత్తేదారుకు సూచించారు. రహదారి నిర్మాణంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పల్ల అప్పలరాజు, దుక్క అప్పారావు, పల్లరవి, జి.మహేశ్, కర్రి పైడిరాజు, కిలారి చిన్నారావు, అజయ్, కర్రి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


రహదారి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాపర్తి కన్నా, తదితరులు

బీఆర్టీఎస్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు

వేపగుంట, న్యూస్‌టుడే: బీఆర్టీఎస్ సర్వీసు రహదారిలో వాహనాల వేగాన్ని నియంత్రించి, ప్రమాదాలను అరికట్టేందుకు జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా పలుచోట్ల వేగ నిరోధకాలను నిర్మిస్తున్నారు. ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలైన జీవీఎంసీ జోన్-8 కార్యాలయం దరి, వేపగుంట కూడలి, పినగాడి వెళ్లే ఫ్రీలెఫ్ట్, పురుషోత్తపురం బాలాజీ హైఫీల్డ్స్ పాఠశాల, వేపగుంట జెడ్పీ పాఠశాలల వద్ద వేగ నిరోధకాలను నిర్మిస్తున్నారు. ట్రాఫిక్ ఎస్ఐ నర్సింగరాజు దగ్గరుండి ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. వాహనదారులు వేగ నిరోధకాలను గమనించుకుంటూ ప్రయాణాలు సాగించాలని ఎస్ఐ సూచించారు.


వేపగుంట కూడలిలోని ఫ్రీలెఫ్ట్‌లో నిర్మించిన వేగ నిరోధకం

రాయితీ టమాటాలకు బారులు


టమాటా దుకాణం ఎదుట వినియోగదారులు

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా టమాటా ధరలు కొండెక్కిన నేపథ్యంలో ప్రభుత్వం రైతుబజార్‌లలో రాయితీ ధరలకు విక్రయాలు చేయాలని ఆదేశించింది. ఆ మేరకు పెందుర్తి రైతుబజార్‌లలో బుధవారం నుంచి రాయితీ టమాటా విక్రయాలు ప్రారంభమయ్యాయి. కిలో రూ.50కు ఒక్కో వినియోగదారుడికి 2 కిలోల చొప్పున విక్రయిస్తున్నట్లు ఎస్టేట్ అధికారి షర్మిల తెలిపారు. టమాటా విక్రయాలను జిల్లా మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకుడు సుధాకర్, ఉప సంచాలకుడు శ్రీనివాస్ కిరణ్ పరిశీలించారు. ఎలాంటి లోపాలు, ఇబ్బందులు లేకుండా విక్రయాలు జరపాలని అధికారులను ఆదేశించారు. బుధవారం పెందుర్తి రైతుబజార్ శెలవు అయినప్పటికీ కేవలం టమాటా విక్రయాల కోసం మాత్రమే తెరిచారు.

మర్యాద పూర్వక కలయిక

పెందుర్తి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బత్తుల తాతయ్యబాబును జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చోడవరంలోని వడ్డాది గ్రామంలో ఆయన నివాసంలో కలిసి శాలువతో సత్కరించారు.


బత్తుల తాతయ్యబాబును సత్కరిస్తున్న జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, తదితరులు

అనాథ బాలికలకు నిత్యావసరాల వితరణ

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన పి.సతీశ్‌కుమార్ కుటుంబం సుజాతనగర్ దరి ఆకార్ బాలికల సంరక్షణ కేంద్రంలో ఉంటున్న అనాథ బాలికలకు బుధవారం నిత్యావసర వస్తువులు వితరణ చేశారు. మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. వారి రోజువారీ అవసరాలకు సరిపడే విధంగా సామగ్రిని పంపిణీ చేశామని దాతలు పేర్కొన్నారు.


బాలికలకు నిత్యావసరాలు అందించిన సతీశ్‌కుమార్, కుటుంబ సభ్యులు

పొగ.. పర్యావరణానికి సెగ

పరవాడ, న్యూస్‌టుడే: సకాలంలో చెత్తను సంపద కేంద్రాలు, డంపింగ్ యార్డులకు తరలించకపోవడంతో పలువురు వాటికి నిప్పు పెట్టడంతో దట్టమైన పొగ అలముకుని స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరవాడ మండలం గొర్లెవానిపాలెం పంచాయతీలో ఎక్కడ చూసినా వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. కొత్తగొర్లెవానిపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలో గాజువాక - ఎలమంచిలి రహదారిని ఆనుకుని చెత్తకుప్పలు పేరుకుపోయాయి. స్థానిక దుకాణాల నుంచి వెలువడే ప్లాస్టిక్ వ్యర్థాలను ఇక్కడ వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ముఖద్వారానికి ఎదురుగా ఉన్న వ్యర్థాలకు బుధవారం సాయంత్రం నిప్పు పెట్టడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదచారులు దట్టమైన పొగ, కళ్ల మంటలతో నానా ఇబ్బందులు పడ్డారు. రహదారి పక్కన చెత్త వేస్తే రూ.వెయ్యి జరిమానా విధిస్తామని పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టినా ఫలితం లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెత్త సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


గొర్లెవానిపాలెం టిడ్కో నివాసాలకు సమీపంలో పేరుకుపోయిన చెత్త


జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ముఖద్వారం వద్ద చెత్తకు నిప్పు పెట్టడంతో అలముకున్న పొగ

వందే జననీ.. విద్యాదాయిని


సరిపల్లిలో చదువుల తల్లిగా దుర్గమాంబ


ఎస్ఆర్‌పురంలో..


శ్రమశక్తినగర్‌లో..


సప్తగిరినగర్‌లో విద్యాలక్ష్మిగా అలమేలు మంగమ్మ


తానాంలో..


సరస్వతీదేవిగా నాయుడుతోట గాయత్రి అమ్మవారు

వందే జననీ విద్యాదాయిని.. వాణీ వీణా మృదుపాణి.. అంటూ భక్తులు చదువుల తల్లి సరస్వతీ మాతను భక్తిశ్రద్ధలతో కొలిచారు. శ్రీదేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని జగన్మాత సరస్వతిగా భక్తుల పూజలందుకుంది. పలు దేవాలయాలు, ఉత్సవ మండపాల కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల సామూహిక అక్షరాభ్యాసాలు జరిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులతో కలిసి పాల్గొన్నారు. నిర్వాహకులు బాలలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.
– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, పరవాడ, సబ్బవరం


దుర్గానగర్‌లో..


వేపగుంట ముత్యమాంబ


కృష్ణానగర్‌లో..


బాలాజీగార్డెన్ అపార్ట్‌మెంట్‌లో..


సబ్బవరం దుర్గమాంబ


దేవీపురంలో హంస వాహనంపై..


పిట్టవానిపాలెంలో..


పరవాడ కొత్తకాలనీలో


వెన్నెలపాలెం హనుమాన్‌కాలనీలో..


మొగలిపురంలో అమ్మవారిని దర్శించుకుంటున్న నేతలు


శారదాపీఠంలో సామూహిక అక్షరాభ్యాసం


పరవాడ సంతబయలులో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న నాయకులు, కమిటీ ప్రతినిధులు

దెబ్బతిన్న ఉద్యానపంటల పరిశీలన

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి పాలవలసలో మామిడి, జీడిమామిడి తదితర ఉద్యాన పంటలను బుధవారం ఉద్యానవన శాఖ ఏడీ కె.ఎస్.ఎన్.రెడ్డి పరిశీలించారు. పాలవలసలోని హిందుజా విద్యుత్తు కేంద్రానికి చెందిన యాష్‌పాండ్ నీటి కాలుష్యం వల్ల జీడిమామిడి, కొబ్బరితోటలు దెబ్బతింటున్నాయని ఈనెల 7న విశాఖ జిల్లా కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానిక రైతులు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడీ రైతులతో కలిసి తోటలను పరిశీలించారు. చనిపోయిన చెట్లకు పరిహారం ఇప్పించి ఆదుకోవాలని ఏడీని రైతులంతా కోరారు. యాష్‌పాండ్ నీరు తోటల్లోకి రాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరారు. ఇక్కడి నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని ఏడీ రైతులకు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పాల అచ్చిలనాయుడు, పాల నగేశ్, కాకి నారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఏడీకి సమస్యలను వివరిస్తున్న నాయకులు, రైతులు

'సెయిల్‌లో విలీనం చేయాల్సిందే..!'

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేసి, కార్మిక భద్రత కల్పించాలని పోరాట కమిటీ నాయకుడు ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే దీక్షలు బుధవారం 1136వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమను కాపాడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకోవాలన్నారు. ఇదే అంశంపై కేంద్రాన్ని ఒప్పించాలని కోరారు. శిబిరంలో ఇంటక్ నాయకులు, సభ్యులు కూర్చున్నారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, వి.రామ్మోహన్‌కుమార్, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో మాట్లాడుతున్న రాజశేఖర్

విశాఖ తీరం.. నౌకా విన్యాసాల కేంద్రం



ప్రారంభ వేడుకలో పాల్గొన్న నాలుగు దేశాల నౌకాదళాల అధికారులు

ఈనాడు, విశాఖపట్నం

భారత నౌకాదళ కార్యకలాపాలకు విశాఖ కీలకంగా మారింది. తూర్పు నౌకాదళం ముఖ్య కేంద్రమైన నగరంలో ఏటా 'నేవీ డే' నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బహుళ దేశాల నౌకాదళ విన్యాసాల (మిలాన్-2024)కు వేదికైంది. తాజాగా భారత నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 28వ 'మలబార్' విన్యాసాలకు ఆతిథ్యమిస్తుంది. ఈ సంయుక్త విన్యాసాల్లో భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాల నౌకాదళాలు పాల్గొంటున్నాయి. సంక్లిష్ట విన్యాసాలతో కూడిన 'మలబార్' ఇప్పటి వరకు నిర్వహించిన వాటికంటే అత్యంత సమగ్రంగా ఉంటుందని నౌకాదళ అధికారులు భావిస్తున్నారు.

మలబార్ లక్ష్యం: ఇండో-పసిఫిక్ ప్రాంతం, హిందూ మహాసముద్రంలో సవాళ్లను పరిష్కరించడం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, పరస్పర అవగాహన పెంపొందించుకోవడం

భాగస్వామ్య దేశాల నౌకలివే

భారత్: ఐఎన్ఎస్ దిల్లీ, ఐఎన్ఎస్ టబర్, ఐఎన్ఎస్ కద్మట్, ఐఎన్ఎస్ కమోర్టా, ఐఎన్ఎస్ శక్తి, పీ-8ఐ

ఆస్ట్రేలియా: హెచ్ఎంఏఎస్ స్టార్ట్, ఎంహెచ్-60ఆర్ హెలికాప్టర్, పీ8 మారిటైం పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్

యూఎస్: యూఎస్ఎస్ డివే, ఇంటిగ్రల్ హెలికాప్టర్, పీ8 మారిటైం పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్ **జపాన్:** ఆరియకె

ఆ పేరెందుకు..?

దేశంలోని పశ్చిమ తీరంలో 1992లో తొలిసారిగా ఈ విన్యాసాలను నిర్వహించారు. దీంతో 'మలబార్' పేరును ఖరారు చేశారు. భారత్, అమెరికాల మధ్య ద్వైపాక్షిక విన్యాసాలుగా ప్రారంభమైన 'మలబార్' బహుపాక్షిక వినాస్యాల స్థాయికి చేరింది. మలబార్‌లో 2015లో జపాన్, 2020లో ఆస్ట్రేలియా చేరాయి.

★ 2007లో దీన్ని తొలిసారిగా బంగాళాఖాతంలో నిర్వహించారు. 2020 తర్వాత భారత్ మళ్లీ ఆతిథ్యమిస్తోంది

ఘనంగా 'మలబార్-2024' ప్రారంభం

హార్బర్ ఫేజ్: ఈ నెల 12 వరకు

సీ ఫేజ్: 13 నుంచి 18 వరకు

కార్యకలాపాలు: సముద్ర సవాళ్లను ఎదుర్కొనేందుకు కలసికట్టుగా పనిచేసేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకోనున్నారు. గగనతలం, సముద్ర జలాల్లో నౌకలు, సబ్‌మెరైన్లు, ఫైటర్‌జెట్లు, ఎంఆర్ ఎయిర్‌క్రాఫ్ట్ తదితరాలతో విన్యాసాలు నిర్వహిస్తారు. సంక్లిష్ట ఆపరేషన్లు, యుద్ధంలో అన్ని డొమైన్లపైనా అవగాహన, మారిటైం సవాళ్లపై చర్చలు, వాస్తవిక ధోరణిలో విన్యాసాలు, సామర్థ్యాలు, సవాళ్లు, సంసిద్ధతపై అవగాహన కల్పిస్తారు.

పరస్పర భాగస్వామ్యంతో: 'సిటీ ఆఫ్ డెస్టినీ'గా పేరొందిన విశాఖ.. భారత సంస్కృతి, వారసత్వ సంపదను ప్రతిబింబిస్తుంది. ఇక్కడ మలబార్ విన్యాసాలు నిర్వహించడం సంతోషంగా ఉంది. విధానాల మార్పిడి, సంక్లిష్ట ఆపరేషన్లు నిర్వహించడానికి మిశ్రమ సామర్థ్యాలను మెరుగుపరచుకోవడంపై పరస్పర భాగస్వామ్యంతో పనిచేయనున్నాం. భవిష్యత్తు సహకారం, అవగాహనకు ఇక్కడి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకుంటాం.


– వైస్‌అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, తూర్పు నౌకాదళం ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్

సాగర తీరం.. యోగాభ్యాసం

సింధియా, న్యూస్‌టుడే : మలబార్-2024 సముద్ర విన్యాసాల్లో భాగంగా బుధవారం విశాఖపట్నం సాగర తీరంలో భారత నౌకాదళం ఆధ్వర్యంలో యోగా సాధన చేశాయి. భారత నేవీ సిబ్బందితో పాటు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాకు చెందిన సిబ్బంది యోగాభ్యాసనంలో పాల్గొన్నాయి.


విన్యాసాల్లో పాల్గొన్న నౌకాదళం సిబ్బంది

రతన్ టాటా ప్రసంగం నేటికీ స్మరణీయం




విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీకి 2018 డిసెంబరు 10న టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా వచ్చారు. ఆ రోజు జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం సమావేశానికి హాజరై వారిని ఉద్దేశించి ప్రసంగించారు. పలు రంగాల ప్రముఖులు కూడా ఈ సమావేశానికి వచ్చారు. విశాఖపట్నాన్ని డైనమిక్ సిటీగా రతన్ టాటా అభివర్ణించారు. విద్యార్థులు దేశానికి ఉపయోగపడేలా సేవలందించాలని సూచించారు. బుధవారం రాత్రి రతన్ టాటా కన్నుమూసిన సమాచారం తెలిసి పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఏయూలో ఆయన చేసిన ప్రసంగం, దిశానిర్దేశాన్ని మరోసారి గుర్తుచేసుకున్నారు. –ఈనాడు, విశాఖపట్నం



'బతుకమ్మ'కు పూజలు

అక్కయ్యపాలెం నందగిరి నగర్ దుర్గమ్మ మండపం వద్ద బుధవారం బతుకమ్మ చుట్టూ భక్తులు పూజలు చేశారు. భక్తిగీతాలు ఆలపించారు. వివిధ రకాలో పుష్పాలతో బతుకమ్మను చూడముచ్చటగా నెలకొల్పారు. –ఈనాడు, విశాఖపట్నం

అప్పన్న ఆలయంలో వైభవంగా ఆయుధ పూజలు



తాయార్ సన్నిధి వద్ద స్వామివారి ఆయుధాలు, ఆయుధ పూజ చేస్తున్న ఉప ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు తదితరులు

సింహాచలం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం వీరలక్ష్మీ ఆరాధన జరిగింది. ఆలయ బేడామండపంలోని సింహవల్లీ తాయార్ సన్నిధిలో ఆలయ స్థానాచార్యుడు టి.పి. రాజగోపాల్, ఉప ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు నేతృత్వంలో అర్చకులు స్వామివారి ఆయుధాలను అమ్మవారి ఎదుట అధిష్ఠింపజేశారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు జరిపారు. ఆయుధాలకు విశేష పూజలు జరిపి ప్రత్యేక నివేదనలు సమర్పించారు. సాయంత్రం బేడామండపంలో చతుర్భుజ తాయార్, స్వర్ణలక్ష్మీ అమ్మవార్ల తిరువీధి వేడుక సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు అమ్మవారికి కుంకుమార్చనలు జరిపారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

సింహాచలం, న్యూస్‌టుడే: ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, తెలుగు సినీ కథానాయకుడు సుధీర్ బాబు బుధవారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. పండితులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకుడు త్రిమూర్తులు స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. అనంతరం సుధీర్‌బాబు మాట్లాడుతూ తాను కథానాయకుడిగా నటించిన 'మా నాన్న సూపర్‌హీరో' చిత్రం ప్రచారానికి విశాఖ వచ్చినట్లు పేర్కొన్నారు.


కప్పస్తంభం వద్ద కథానాయకుడు సుధీర్‌బాబు


మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజుకు ప్రసాదం అందిస్తున్న ఆలయ పర్యవేక్షకుడు త్రిమూర్తులు

ఆదిలోనే గుర్తిద్దాం.. ఆనందంగా జీవిద్దాం..

పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తున్న మానసిక సమస్యలు

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే

గుండె జబ్బులు... ఊబకాయం... దృష్టి లోపం వంటి శారీరక సమస్యలు సాధారణంగా నలభై.. యాభై ఏళ్లు దాటిన తర్వాత ఎక్కువ మందిలో కనిపించేవి. ఇప్పుడు యువత, చిన్న పిల్లలు కూడా వీటి బారిన పడుతున్నారు. దీనికితోడు ఇప్పుడు మానసిక సమస్యలకు కూడా వయసంటూ లేకుండాపోయింది. ముఖ్యంగా చిన్నారుల్లో మానసిక సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని విశాఖ మానసిక ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు కూడా వీరికోసం ఏర్పాటు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆదిలోనే గుర్తిస్తే.. ఆనందంగా జీవించవచ్చని వైద్యులు చెప్తున్నారు.



పిల్లల్లో గుర్తించిన సమస్యలు..

పిల్లల్లో మానసిక సమస్యలు రెండు రకాలుగా ఉంటున్నాయి. కొన్ని జన్యు సంబంధమైనవి. పుట్టుకతోనే మెదడు సరిగా ఎదగకపోవడం, ఆటిజం, అతిచురుకుదనం వంటివి చిన్నారుల్లో మానసిక సమస్యకు దారితీస్తున్నాయి. వీటికి వైద్య పరిష్కారాలు ఓ స్థాయి వరకే ఉంటాయి. ఇది మొదటిరకం.

పిల్లలకు ప్రత్యేక విభాగం..

★ చిన్నారుల కోసం మానసిక ఆసుపత్రిలో ప్రత్యేక భవనం ఏర్పాటు చేసి అక్కడ ఓపీ విభాగం ఉంచారు. ★ 30 పడకలు ఏర్పాటు చేశారు. ★ 0 నుంచి 12 సంవత్సరాలోపువారిని చిన్నారులుగా, 13 నుంచి 18 సంవత్సరాలని వారిని కౌమారులుగా విభజించి వేర్వేరుగా చికిత్స అందిస్తున్నారు. ★ ప్రతీరోజు 20 నుంచి 30 వరకు చిన్నారులకు సంబంధించి ఓపీ నమోదవుతోంది. ★ వీరిలో సుమారు 20 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చేరి వైద్యం పొందుతుంటారు. ★ వైద్యంతో పాటు స్పీచ్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ అందిస్తారు. ★ ఇద్దరు సీనియర్ వైద్యులు, ముగ్గురు శిక్షకులు, నర్సింగ్ సిబ్బంది, వార్డు బాయ్ ఎప్పుడూ అందుబాటులో ఉంటారు.

గత నాలుగు రోజుల్లో నమోదైన ఓపీ

	ఓపీకి వచ్చినవారు	చిన్నారులు	కౌమార దశలోని వారు
శనివారం	23	13	10
సోమవారం	21	13	8
మంగళవారం	26	15	11
బుధవారం	30	20	10


పిల్లల ప్రత్యేక వార్డు

ప్రస్తుత సమాజంలో చిన్నారులపై అనేక అంశాలు ప్రభావం చూపిస్తుంటాయి. సెల్‌ఫోన్లు, స్నేహితులు, అతిగారాబం రెండోరకం మానసిక సమస్యల కిందకు వస్తాయి. వీటిని పూర్తిస్థాయిలో నయం చేయవచ్చని మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ ఎన్.ప్రసన్నకుమార్ తెలిపారు. మానసిక ఆసుపత్రిలోని ప్రత్యేక విభాగంలో వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు.



శ్రీకాకుళం రోడ్ - విజయవాడ మధ్య ప్రత్యేక రైలు

విశాఖకు రాకుండానే రాకపోకలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విజయవాడ - శ్రీకాకుళం రోడ్ - విజయవాడ(07215-07216) మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ బుధవారం తెలిపారు. అయితే ఈ రైలు విశాఖపట్నం రాకుండా ప్రయాణాన్ని సాగించేలా చర్యలు చేపట్టారు.

★ ఈ నెల 9 నుంచి 17 వరకు(13 మినహా) రాత్రి 8 గంటలకు విజయవాడలో బయలుదేరి అదే రోజు అర్ధరాత్రి దాటిన తర్వాత 1.28 గంటలకు దువ్వాడ చేరుకొని అక్కడి నుంచి 1.30 గంటలకు బయలుదేరి 2.23 గంటలకు పెందుర్తి, 2.33 గంటలకు కొత్తవలస చేరుకోనున్నట్లు తెలిపారు. ఈ నెల 10 నుంచి 18 వరకు(14 మినహా) ఉదయం 6.30 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలుదేరి ఉదయం 9.30 గంటలకు దువ్వాడ చేరుకొని అక్కడి నుంచి విజయవాడకు వెళ్లనున్నట్లు తెలిపారు. అర్ధరాత్రి దాటిన తరువాత ఏ విధమైన రవాణ వ్యవస్థ లేని చోట్లకు రైలు నడుపుతామని చెప్పడంపై పలువురు ప్రయాణికుల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పలు రైళ్లకు అదనపు బోగీలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దసరా పండగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు రైళ్లకు అదనపు బోగీలు జత చేయనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ బుధవారం తెలిపారు. ఈనెల 9 నుంచి 16 వరకు విశాఖ - కోరాపుట్(08546), విశాఖ-బ్రహ్మపుర(08532), ఈ నెల 10 నుంచి 17 వరకు కోరాపుట్-విశాఖ(08545), బ్రహ్మపుర-విశాఖ(08531) రైళ్లకు ఒక్కో సాధారణ రెండో తరగతి బోగీ జత చేయనున్నట్లు తెలిపారు.

★ ఈ నెల 10 నుంచి 17 వరకు విశాఖ-భవానీపట్నం(08504), ఈ నెల 11 నుంచి 18 వరకు భవానీపట్నం-విశాఖ(08503) రైళ్లకు రెండు సాధారణ రెండో తరగతి బోగీలు జత చేయనున్నామన్నారు.

★ ఈ నెల 11 నుంచి 17 వరకు విశాఖ-రాయ్‌పుర్(08528), ఈ నెల 12 నుంచి 18 వరకు రాయ్‌పుర్-విశాఖ(08527) రైళ్లకు ఒక సాధారణ రెండో తరగతి బోగీ జత చేయనున్నామని ప్రయాణికులు గమనించి ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

13 గంటలు ఆలస్యంగా సంత్రాగచ్చి - సికింద్రాబాద్ రైలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: లింకు రైలు అందుబాటులో లేకపోవడంతో ఈ నెల 9న మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరాల్సిన సంత్రాగచ్చి- సికింద్రాబాద్ (07222) ప్రత్యేక దాదాపు 13 గంటల ఆలస్యంగా అర్ధరాత్రి దాటిన తరువాత 1.30 గంటలకు బయలుదేరేలా మార్పు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

మసకబారిన కంటి వెలుగులు..!

☛ ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'టెలీ ఆప్తమాలజీ' సేవలకు బ్రేక్ ☛ గుత్తేదారు సంస్థతో ముగిసిన ఒప్పందం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో టెలీ ఆప్తమాలజీ సేవలు నిలిచిపోయాయి. గుత్తేదారు సంస్థతో కుదుర్చుకున్న ఒప్పంద గడువు ముగియడంతో దాదాపు నెల రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న 'ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాల్లో' వైద్యం అందడం లేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- న్యూస్‌టుడే, అగనంపూడి



పేద, మధ్య తరగతి ప్రజల కంటి వ్యాధులను సకాలంలో గుర్తించి అత్యాధునిక చికిత్స అందించేందుకు ఆరేళ్ల కిందట అప్పటి తెదేపా ప్రభుత్వం సంకల్పించింది. 2018లో తీసుకొచ్చిన టెలీ ఆప్తమాలజీ పథకాన్ని అమలు చేసేందుకు అపోలో ఆసుపత్రితో పాటు, మరో రెండు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది.

★ రాష్ట్ర వ్యాప్తంగా 121 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (సీహెచ్‌సీ) ముఖ్యమంత్రి ఎలక్ట్రానిక్ ఐ కేంద్రాలను (సీఎం ఈ ఐ కేంద్రాలు) ప్రారంభించారు. ప్రతి కేంద్రంలోనూ ఆధునిక వైద్య పరికరాలు, కంప్యూటర్లు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు.

★ రోగులకు ఉచితంగా నేత్ర పరీక్షలు చేసి, వ్యాధి నిర్ధారణతో అవసరమైన చికిత్స అందించేవారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేసేవారు. మెరుగైన సేవలు అందడంతో ఈ కేంద్రాలకు ప్రజల నుంచి మంచి స్పందన ఉండేది.

★ అపోలో ఆసుపత్రితో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం గత నెల 4తో పూర్తయింది. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గడువును పునరుద్ధరించాలని రోగులు కోరుతున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో...

ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో మొత్తం తొమ్మిది ఆసుపత్రుల్లో ఈ పథకాన్ని అమలు చేసేవారు. అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రితో పాటు భీమిలి, పెందుర్తి, చోడవరం, కె.కోటపాడు, ఎలమంచిలి, నక్కపల్లి, పాడేరు, అరకు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో 'ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాలు' ప్రస్తుతం మూతపడ్డాయి.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..

ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాలు మూతపడినా... ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఇక్కడి ఆసుపత్రిలో ప్రభుత్వ ఆప్తమాలజిస్ట్ విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఆంధ్రా మెడికల్ కళాశాలలో పీజీ చేస్తున్న ఓ విద్యార్థిని శిక్షణ కోసం వస్తున్నారు. ప్రస్తుతం వారిద్దరూ కంటివైద్య సేవలు అందిస్తున్నారు. త్వరలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అనుమతితో ముఖ్యమైన వైద్య పరికరాలు కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– డాక్టర్ జె.భారతి, సూపరింటెండెంట్, అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రి

తరలిపోయిన సామగ్రి

★ ఆయా కేంద్రాల్లో ఉండాల్సిన వైద్య పరికరాలు, కంప్యూటర్లు, స్కానర్లు, కుర్చీలు తదితర సామగ్రిని గుత్తేదారు సంస్థ సిబ్బంది తీసుకెళ్లిపోయారు. ★ ప్రస్తుతం ఆటో రిఫ్రాక్టో మీటర్ లేకపోవడంతో కంటి సామర్థ్యాన్ని తెలుసుకునే వీలుండడం లేదు. ఫండస్ కెమెరా అందుబాటులో లేక మధుమేహం, రక్తపోటు, గ్లకోమా ఉన్న వారిలో దృష్టి లోపాలు గుర్తించేందుకు, రెటీనా పనితీరు తెలుసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. ★ లెన్సోమీటర్ లేక రోగుల కళ్లజోళ్లకు వాడే అద్దాల సామర్థ్యం తెలుసుకునేందుకు సాధ్యపడడం లేదు. గుత్తేదారు సంస్థ నియమించిన వైద్య సిబ్బంది లేక ఆయా కేంద్రాలు మూతపడ్డాయి. ప్రభుత్వం తరఫున వైద్యులు ఉన్న చోట మాత్రమే సేవలు అరకొరగా సాగుతున్నాయి.

ఉమ్మడి విశాఖలో.. ఇదీ లెక్క (2018 నుంచి 2024 సెప్టెంబరు వరకు..)

◆ నమోదైన ఓపీ కేసులు	: 2,81,725
◆ పంపిణీ చేసిన కళ్లద్దాలు	: 2,29,623
◆ ఫండస్ తనిఖీలు	: 1,09,461


అగనంపూడిలో ముఖ్యమంత్రి ఈ- ఐ కేంద్రం

ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు చర్యలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని దీనిలో భాగంగా వివిధ పద్దుల కింద రూ.1700 కోట్లు విడుదల చేసినట్లు ఎంపీ ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. తెదేపా కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉక్కు ఒప్పంద కార్మికుల విషయంలో కొంత సమాచార లోపంతో ఈ-పాస్ వ్యవహారం జరిగిందని ఆ సమస్యను పరిష్కరించామన్నారు. ఉక్కు పరిశ్రమకు రూ.30 వేల కోట్ల స్థిర ఆస్తులున్నాయని ఉత్పత్తి త్వరలో పెరగనున్నదని తెలిపారు. బ్లాస్ట్ ఫర్నేస్-2 త్వరలో ఆరంభమవుతుందని, పరిశ్రమకు మూడో గనికి కూడా అనుమతి వస్తుందన్నారు. రైల్వే జోన్ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి అవసరమైన భూములను కేటాయించామని, త్వరలోనే భూమి పూజ చేస్తామన్నారు. రాష్ట్రానికి రూ.75 వేల కోట్ల ప్రాజెక్టులను కేంద్రం ఇస్తోందన్నారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి వందరోజుల్లో అనేక కార్యక్రమాలు అమలు చేశామన్నారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేయడమే శాశ్వత పరిష్కారమని భావిస్తున్నామన్నారు. వరద సహాయక కార్యక్రమాల పట్ల ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. గంగవరం పోర్టులో ఉన్న 10.25 శాతం ప్రభుత్వ వాటాను విక్రయించేశారని, దీంతో ఉక్కు పరిశ్రమను సైతం ప్రైవేటు పరం అవుతుందనే భయం పెరిగిందన్నారు. సమావేశంలో తెదేపా విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఎం.శ్రీభరత్

లంబసింగిని అద్భుత పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతాం

సింహాచలం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే అద్భుత పర్యాటక ప్రాంతంగా లంబసింగిని తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. బుధవారం ఆయన సింహాద్రి అప్పన్న స్వామిని, అల్లూరి జిల్లా లంబసింగి పర్యాటక ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లంబసింగిలో 20 ఎకరాల్లో పర్యాటకులకు అవసరమైన అన్ని వసతులు ఉన్నాయన్నారు. మరిన్ని సౌకర్యాలు కల్పించి రహదారులు నిర్మిస్తామన్నారు. గతంలో తెదేపా హయాంలోనే ఆ ప్రదేశాన్ని అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. వైకాపా ప్రభుత్వం టెండర్లు లేకుండా అప్పగించిన పనులను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. సింహాచలంలో ప్రసాద్ పథకం నిధులు రూ.54కోట్లతో పలు అభివృద్ధి పనులు, పార్కుల నిర్మాణం కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రాంతాలకు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. పర్యాటకం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరేందుకు, పర్యాటకశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలోని సుదీర్ఘమైన తీర ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలను ఉపయోగించుకుంటామన్నారు.


ప్రసాద్ పథకం పనుల ప్రణాళికను పరిశీలిస్తున్న రాష్ట్ర పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ తదితరులు

శిరస్త్రాణం లేకపోతే... లైసెన్సు రద్దు



మాధవధార, న్యూస్‌టుడే

శిరస్త్రాణం లేకుండా వాహనాలు నడిపి, ప్రమాదాల బారిన పడి 80 శాతం మంది చోదకులు మృతి చెందుతున్నారు. శిరస్త్రాణం లేకపోవడంతో, ప్రమాదంలో తల పరిసర భాగాల్లో దెబ్బ తగలడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడుతున్నట్లుగా రోడ్డు సేఫ్టీ కమిటీ నివేదికను సమర్పించింది. దీంతో సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటైన రోడ్డు సేఫ్టీ కమిటీ ద్విచక్ర వాహనం నడిపే చోదకుడితో పాటు, వెనుక కూర్చున్న వ్యక్తి కూడా శిరస్త్రాణం ధరించాలని నిర్ణయించింది. కోర్టు ఆదేశాల ప్రకారం వాహనం నడిపే వ్యక్తి, వెనుక ఉన్న వ్యక్తి శిరస్త్రాణం ధరించాలని, లేకపోతే వారి లైసెన్సును మూడు నెలలపాటు తాత్కాలికంగా రద్దు చేయాలన్న నిబంధనను పక్కాగా అమలు చేయాలని సూచించారు. ప్రతి మూడు నెలలకోసారి రోడ్డు సేఫ్టీ కమిటీ దీనిపై పర్యవేక్షిస్తుంది. దీంతో వాహన చోదకులు శిరస్త్రాణం ధరించేలా మార్పు తీసుకువచ్చేందుకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా సెప్టెంబర్ 1 నుంచి శిరస్త్రాణం లేకపోతే లైసెన్సు రద్దు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఒక్క విశాఖ నగరంలో మాత్రమే ఈ నిబంధనను అమలు చేస్తున్నారు.

కోర్టు ఆదేశాల్ని ప్రతి చోదకుడూ పాటించాల్సిందే..

లైసెన్సు లేకపోతే వాహనం సీజ్

వాహన చట్టం ప్రకారం శిరస్త్రాణం లేకుండా మొదటి సారి పట్టుబడితే రూ.1035 జరిమానా విధించి, మూడు నెలల పాటు తాత్కాలికంగా లైసెన్సులను రద్దు చేస్తారు. రెండోసారి పట్టుబడితే ఆరు నెలలు, మూడోసారి పట్టుబడితే లైసెన్సును పూర్తిగా రద్దు చేస్తారు. మొదటి మూడు నెలల్లోనే మూడు సార్లు పట్టుబడితే ఆ సమయంలోనే లైసెన్సును రద్దు చేయడం జరుగుతుంది. ఒక వేళ లైసెన్సు లేకుండా వాహనం నడిపి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తారు.


శిరస్త్రాణం లేని చోదకులపై కేసులు నమోదు చేస్తున్న రవాణా, పోలీస్ అధికారులు

రద్దు అంటే లైసెన్సు లేనట్లే..

శిరస్త్రాణం లేకుండా పట్టుబడితే మొదటి సారి మూడు నెలల పాటు లైసెన్సును తాత్కాలికంగా రద్దు చేస్తారు. ఈ మూడు నెలలూ లైసెన్సు లేనట్లుగానే పరిగణిస్తారు. నిబంధనల ప్రకారం ఆ మూడు నెలలూ వాహనం నడపకూడదు. ఒకవేళ వాహనం నడిపితే ఏదైనా అనుకోని ప్రమాదం జరిగిందంటే చోదకుడికి బీమా వర్తించదు. వాహనానికి గానీ, చోదకుడికి గానీ ఇతర ఏవిధమైన బీమాలున్నా, అవి ఏవీ వర్తింపచేయరు. ఒకసారి లైసెన్సు తాత్కాలికంగా రద్దు చేస్తే మూడు నెలలపాటు ఆ చోదకుడు జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి.

రోజుకు 700 మందిపై కేసులు

నగరంలో ప్రతి రోజూ ట్రాఫిక్ పోలీసులు పలు కూడళ్ల వద్ద తనిఖీలు చేపట్టి 700లకు పైగా శిరస్త్రాణం లేకుండా ప్రయాణించే చోదకులపై కేసులు నమోదు చేస్తున్నారు. పోలీసులు పట్టుబడిన చోదకుల లైసెన్సుల వివరాలను నమోదు చేసి, వాటిని రద్దు చేయాలని కోరుతూ రవాణా శాఖకు సిఫార్సు చేస్తున్నారు. సెప్టెంబర్ నెలలో సుమారుగా 10,456 మంది లైసెన్సులను రద్దు చేయాలని ట్రాఫిక్ పోలీసులు సిఫార్సులు చేయగా, ఇప్పటి వరకు 8456 మంది లైసెన్సులను రద్దు చేశారు.

భీమిలి

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే
గణేశ్ – వేట్టయాన్ ది హంటర్
రాములమ్మ– దేవర,
తాతా – వేట్టయాన్ ది హంటర్,
సప్తగిరి– శ్వాగ్, చోటుమహరాజ్
(ఆనందపురం) – వేట్టయాన్ ది హంటర్

నేడు శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు

కొమ్మాది, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా మధురవాడ శిల్పారామం (జాతర)లో గురువారం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. దుర్గాష్టమి పురస్కరించుకుని సాయంత్రం 6గంటల నుంచి నగరానికి చెందిన మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అసోసియేషన్ చిన్నారులతో కూచిపూడి, జానపద నృత్యప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సందర్శకులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247
సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

న్యూస్‌టుడే, ఎండాడ

సమస్య: పిఠాపురం లేఅవుట్ (పీఎంపాలెం) ప్రధాన దారిలో వీధి దీపాలు వెలగడం లేదు. –స్థానికులు, పీఎంపాలెం

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –ఎన్.శ్రీనివాస్, విద్యుత్ ఏఈ

సమస్య: ఆర్టీసీ కాలనీ (మధురవాడ) ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగక రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నాం. –స్థానికులు, ఆర్టీసీ కాలనీ

సమాధానం: విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపడతాం. –ఎన్.శ్రీనివాస్, విద్యుత్ ఏఈ

సమస్య: సింహాచలం ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో వీధి రోడ్డు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. – స్థానికులు, సింహాచలం

సమాధానం: త్వరలో రహదారి మరమ్మతులకు చర్యలు చేపడతాం. – సింహాచలం, జోన్–2 కమిషనర్

'స్వచ్ఛ'తే లక్ష్యంగా ముందడుగు

- వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, కళాశాలల ఆధ్వర్యంలో..
- పరిసరాల శుభ్రతకు ప్రజా చైతన్య కార్యక్రమాల నిర్వహణ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా స్వచ్ఛభారత్‌కు అంతా పాటు పడాలని పిలుపునిస్తూ పలు సంస్థలు, వివిధ శాఖల అధికారులు ఇటీవల ప్రజా చైతన్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా జీవీఎంసీ, పర్యాటకశాఖ, పలు బ్యాంకుల ఉద్యోగులతో పాటు నగర పరిధిలోని గీతం, గాయత్రీ తదితర కళాశాలల ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు బృందాలుగా ఏర్పడి స్వచ్ఛందంగా అవగాహన చేపడుతున్నారు. ఈ క్రమంలో సామాజిక బాధ్యతగా సమాజాభివృద్ధే లక్ష్యంగా పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.



మొక్కలు నాటాలని పిలుపునిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఇటీవల చేపట్టినవి..

★ రుషికొండ, సాగర్‌నగర్, ఐటీసెజ్, తెన్నేటిపార్కు తదితర తీర ప్రాంతాల్లో శుభ్రతా చర్యలు చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా సముద్ర జలాలు కలుషితం కాకుండా ఉండాలంటే అంతా పాటించాల్సిన విధానాలు, బీచ్‌లు శుభ్రతగా ఉంటే చేకూరే ఉపయోగాలు, ప్లాస్టిక్ వినియోగం వల్ల తలెత్తే అనర్థాలు ఇతరత్రా ప్రయోజనకర అంశాలపై సందర్శకులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు జీవీఎంసీ, టూరిజం విభాగాల పారిశుద్ధ్య సిబ్బంది సహకారంతో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. ★ ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి చక్కటి పర్యావరణం తోడవ్వాలని పిలుపునిస్తూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణను అంతా బాధ్యతగా స్వీకరించాలని చైతన్యపర్చారు. ★ తడి చెత్త, పొడి చెత్త సేకరణలో జీవీఎంసీ సిబ్బందికి సహకరించాలని పలు కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ★ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలంటే నివాసాల పరిసరాల్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

★ స్వర్ణభారతీనగర్, వాడపాలెం ప్రాంతాల్లో పచ్చదనం సంరక్షణకు అంతా పాటుపడాలని సూచిస్తూ సంత్‌నిరంకారి సభ్యులు మొక్కలు నాటారు. ★ నగర పరిధిలోని పలు బీచ్‌ల పరిసరాల్లోని మురుగు కాల్వల ద్వారా సాగర జలాలు కలుషితమయ్యే రీతిలో ప్లాస్టిక్ వస్తుసామగ్రి ఇతరత్రా వ్యర్థాలు కలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తలెత్తే నష్టాలపై అవగాహన కల్పిస్తూ ప్రజల్ని చైతన్య పరిచారు. ఈ తరుణంలో తీర ప్రాంతాల పరిశుభ్రతలో అంతా బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.


సముద్ర జలాలు కలుషితం అవుతున్నాయనడానికి వలకు లభ్యమైన ఈ చెత్తే నిదర్శనం (పాత చిత్రం)

పీజీఆర్ఎస్ సమస్యలపై జెడ్సీ ఆరా..

కొమ్మాది, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జీవీఎంసీ జోన్-2 యంత్రాంగం ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి సోమవారం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం జోన్-2 జెడ్సీ పి.సింహాచలం వివిధ శాఖల అధికారులతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. మధురవాడ పైవంతెన వద్ద సేవా మార్గంలో రహదారి అధ్వానంగా ఉన్న ప్రాంతంతో పాటు సమీప గెడ్డను పరిశీలించారు. వర్షం పడినపుడు ఇళ్లలోకి నీరు ప్రవేశిస్తోందని స్థానికులు ఏకరవు పెట్టారు. వెంటనే సంబంధిత గెడ్డను అభివృద్ధి చేయడానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు.


మధురవాడ పైవంతెన సమీప గెడ్డను పరిశీలిస్తున్న జెడ్సీ సింహాచలం తదితరులు


కళాసాహితి అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ వర్మను సత్కరిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

కళల ఆదరణతోనే సంప్రదాయాల పరిరక్షణ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించేందుకు కళలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆంధ్ర పద్య కవితా సదస్సు రాష్ట్ర అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. భీమిలిలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్లో కళాసాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు, కళాసాహితి అధ్యక్షుడు పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మను వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సంస్థ గౌరవాధ్యక్షుడు రేలంగి అప్పలనర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, రచయితగా, కవిగా రాజేంద్రప్రసాద్ వర్మ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం వివిధ సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఎ.సన్యాసిరాజు, కె.సన్నీ, ఎ.కిశోర్, ఎస్.రమణప్రసాద్, ఎం.సూర్యశ్రీనివాస్, టి.భీమారావు, ఆర్.బసవకృష్ణమూర్తి, నియోజకవర్గ భాజపా కన్వీనర్ కె.రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణింపు

కొమ్మాది, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరులో ఈనెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ నిర్వహించిన రాష్ట్ర తైక్వాండో పోటీల్లో మధురవాడ ప్రాంతానికి చెందిన యూత్ తైక్వాండో క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా బుధవారం కొమ్మాది వైఎస్ఆర్‌నగర్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన మణికంఠ హిమాన్ష్ (బంగారు పతకం), గొలగాని తేజశ్రీ, ఉదయ్‌నిఖిల్, ఆదిత్య, ధనలక్ష్మీ, శ్రీకరరోహిత్ (రజత పతకాలు), గాయత్రి (కాంస్య పతకం)లను ఏపీ తైక్వాండో రాష్ట్ర అధ్యక్షుడు పి.అచ్యుత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అచ్చింనాయుడు, జిల్లా కోచ్ సుకుమార్ సంపత్, యూత్ తైక్వాండో కోచ్ సురేష్, నేషనల్ రిఫరీ శంకర్, నవీన్ తదితరులు అభినందించారు.


పతకాలు, ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతలకు విరాళం ధ్రువపత్రం అందిస్తున్న సీనియర్ సహాయకుడు సూర్యనారాయణ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతానికి చెందిన పసుపులేటి చంద్రశేఖర్ బుధవారం రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో సీనియర్ సహాయకుడు సూర్యనారాయణకు అందజేశారు. అధికారులు దాత కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకుడు త్రిమూర్తులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

చందన సమర్పణకు..

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామికి చందనోత్సవం సందర్భంగా చందన సమర్పణ చేసేందుకు నగరంలోని విశాలాక్షినగర్ ప్రాంతానికి చెందిన ఎ.ఎస్.ప్రకాశరావు, లలిత దంపతులు బుధవారం రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో ఆలయ పర్యవేక్షకుడు త్రిమూర్తులుకు అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


దాతలకు విరాళం రశీదు అందిస్తున్న ఆలయ పర్యవేక్షకుడు త్రిమూర్తులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: తమిళనాడులో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న జాతీయ సీ (సముద్ర) కయాకింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏపీ తరపున పాల్గొనే జట్టు ఎంపిక రుషికొండ బీచ్‌లో మూడు రోజుల పాటు నిర్వహించారు. కానోయింగ్, కయాకింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సీకేఏపీ) ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 8వతేదీ వరకు మూడు రోజుల పాటు చేపట్టిన ఈ ప్రక్రియలో పురుషులు, మహిళల జూనియర్, సీనియర్ విభాగాల్లో 21 మంది అథ్లెట్లు అర్హత సాధించినట్లు సంబంధిత అధ్యక్షుడు బి.బలరామ్ నాయుడు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారులు ఆకాంక్షిస్తూ వీరిని అభినందించారు.


గోశాల లేఅవుట్‌లో.. | విజినిగిరి పాలెంలో.. | తొలిపావంచా వద్ద.. | సాగర్‌నగర్ బంగారమ్మ ఆలయంలో... | గణగళ్లవీధి దుర్గాదేవి మందిరంలో.. | భీమిలి కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో.. | బ్రాహ్మణవీధి రాజరాజేశ్వరి గుడిలో.. | గీతం వైద్యకళాశాల ప్రాంగణంలో... | రుషికొండ బీచ్‌లోని సప్త రుషీశ్వరాలయంలో...

హంసవాహిని.. జ్ఞాన ప్రదాయిని


శ్రీలక్ష్మీ హయగ్రీవ మందిరంలో.. | చిట్టివలసలో.. | చిప్పాడలో..

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలోని పలు దేవాలయాలు, ఉత్సవ మండపాల ఆధ్వర్యంలో బుధవారం మూలా నక్షత్ర పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని చదువుల తల్లి సరస్వతీ మాతగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పలుచోట్ల సామూహిక అక్షరాభ్యాసాలు, కుంకుమార్చనలు, అన్నప్రసాద వితరణ జరిగాయి. –న్యూస్‌టుడే, సింహాచలం, భీమునిపట్నం, సాగర్‌నగర్, ఎండాడ, కొమ్మాది, మధురవాడ, తగరపువలస, పద్మనాభం


పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో.. | తొలిపావంచా వద్ద మహిళల సామూహిక కుంకుమార్చన


ఎండాడ దుర్గాదేవి ఆలయంలో... | శ్రీసిద్ధేశ్వరస్వామి పీఠం ఆవరణలో.. | శ్రీఅష్టలక్ష్మీ దేవాలయంలో.. | చంద్రంపాలెం జాతరగట్టు వద్ద.. | వాంబే కాలనీ ప్రధాన పార్కు సమీపంలో.. | బింద్రానగర్ సమీప టీజీఎంఆర్ కాలనీలో.. | టైలర్స్ కాలనీ విజయ దుర్గాదేవి ఆలయంలో.. | భీమిలి మండలం చిప్పాడలో..

సహస్రనామార్చనం.. నిత్యకల్యాణ వైభవం


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో బుధవారం పలు ఆర్జిత సేవలు వైభవోపేతంగా జరిగాయి. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. తులసీదళాలతో దేవతామూర్తులకు సహస్రనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

★ సంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసాలు: శరన్నవరాత్రుల్లో భాగంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అప్పన్న ఆలయంలో పలువురు భక్తులు చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిపించారు. అర్చకులు ఆలయ ప్రత మండపంలో లక్ష్మీనారాయణులను అధిష్ఠింపజేసి విశేష పూజలు జరిపారు. చిన్నారులతో అక్షరాలు దిద్దించి హయగ్రీవుడికి పూజలు చేయించారు.

వైభవంగా గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో బుధవారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీదళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేశారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో 'ఫెస్ట్ 2కె24' బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఆడిట్ అధికారి కె.మన్మధరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాల ఛైర్మన్ వై.వెంకట్రావు, డైరెక్టర్ బెల్లాన రామకృష్ణ, ప్రిన్సిపల్ దుక్కా అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

వసతిగృహానికి ప్రహరీ లేక అవస్థలు

మధురవాడ, న్యూస్‌టుడే: మధురవాడలో ఏపీఈపీడీసీఎల్ కార్యాలయ సమీపంలో ఉన్న ఏపీ సాంఘిక సంక్షేమశాఖ కళాశాల బాలుర వసతిగృహం చుట్టూ ప్రహరీ లేక నిర్వాహకులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వసతిగృహం చుట్టూ పందులు, కుక్కలు, పశువులు విపరీతంగా సంచరిస్తున్నాయి. ఒక్కోసారి లోపలికి సైతం పందులు రావడంతో తీవ్ర అసౌకర్యం కలుగుతోందని విద్యార్థులు వాపోతున్నారు. ఈ కారణంగా రోజంతా ప్రధాన ద్వారం తలుపులు మూసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అలాగే పలువురు ఆకతాయిలు రాళ్లు రువ్వడంతో కిటికీ అద్దాలు దెబ్బతింటున్నాయని, చుట్టూ ఉన్న కాలనీవాసులు వసతిగృహం ఎదురుగా వ్యర్థాలు వేయడం, బహిర్భూమి తదితర సమస్యలతో అపరిశుభ్రత, రక్షణ సైతం కరవవుతోందని నిర్వాహకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మధురవాడ ప్రభుత్వ కళాశాల బాలుర వసతిగృహం

అ వీ ఇ వీ

వేడుకగా కోలాటం పోటీలు

పద్మనాభం, న్యూస్‌టుడే: మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో బుధవారం జరిగిన కోలాటం పోటీలు కోలాహలంగా సాగాయి. గ్రామీణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించడానికి గంటా నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ గ్రామాల నుంచి 13 కోలాటం బృందాలు పాల్గొన్నాయి. సీనియర్ విభాగంలో గెద్దపేట గ్రామానికి చెందిన శ్రీరామా మహిళా కోలాటం బృందం, జూనియర్ విభాగంలో పాండ్రంగి గ్రామానికి జట్లమ్మతల్లి కోలాటం బృందం ప్రథమ బహుమతి సాధించాయి. విజేతలకు దసరా రోజున భీమిలిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద బహుమతులు అందజేయనున్నట్లు మండల తెదేపా అధ్యక్షుడు కోరాడ రమణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కె.దామోదరరావు, కె.నగేష్‌కుమార్, కె.లీలావతి, కె.సత్యనారాయణ, ఆవాల గంగరాజు, కె.సుమంత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భీమిలి మండలంలో నేడు..

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి మండల స్థాయి కోలాటం పోటీలు గురువారం నిర్వహించనున్నట్లు ఎమ్పీడీవో కనకల రమేశ్‌నాయుడు తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో జరగనున్న ఈ పోటీలను సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

పొట్నూరులో 'పొలం పిలుస్తోంది'..

పద్మనాభం, న్యూస్‌టుడే: మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొట్నూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. భీమిలి వ్యవసాయశాఖ ఏడీఏ బి.విజయ్‌ప్రసాద్ మాట్లాడుతూ పంట మార్పిడి పద్ధతులు, పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉన్న నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపైనా అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి ఎం.వి.ఎస్.చలం స్థానిక నాయకులు మజ్జి నందీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు ఆసుపత్రి నిర్మించాలి

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస, మధురవాడ, ఆనందపురం, పద్మనాభం పరిసర ప్రాంతాల్లోని మాజీ సైనికుల కోసం ఎక్స్ సర్వీసుమెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీం ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కొయ్య గురయ్యరెడ్డి, తదితరులు ఉన్నతాధికారులకు విన్నవించారు. ఈ మేరకు బుధవారం వినతిపత్రం అందించినట్లు వారు పేర్కొన్నారు. మల్కాపురంలోని ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి వెళ్లాలంటే తీవ్ర వ్యయ ప్రయాసలకు గురి కావాల్సి వస్తోందని వాపోయారు.

టోల్‌గేటు వివాదంలో ముగ్గురి అరెస్టు

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస-విజయనగరం రోడ్డులోని బోడమెట్టపాలెం ఎన్‌హెచ్ఏఐ టోల్‌గేటు వద్ద ఇటీవల జరిగిన కొట్లాటలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు భీమిలి సీఐ బి.సుధాకర్ తెలిపారు. మాక్సీక్యాబ్ డ్రైవర్ ఫిర్యాదు మేరకు బోడమెట్టపాలెం గ్రామానికి చెందిన లొడగల ఎర్రనాయుడు (23), సురేశ్ (21) ఈశ్వరరావు (25)లను అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. క్యాబ్ డ్రైవర్లకు, టోల్‌గేటు సిబ్బందికి ఇటీవల ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఈ వివాదంలో డ్రైవర్‌కు మద్దతుగా వారి యూనియన్, గ్రామస్థులు; టోల్‌గేటు సిబ్బందికి మద్దతుగా బోడమెట్టపాలేనికి చెందిన కొందరు వ్యక్తులు రావడంతో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన భీమిలి పోలీసులు ఆ మేరకు చట్టప్రకారం చర్యలు చేపట్టారు.

వ్యాయామ పరికరాలున్నా.. లేనట్లే..

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి బీచ్ వద్ద ఉన్న ఓపెన్‌జిమ్‌లో వ్యాయామ పరికరాలు పాడవడంతో వీటిపై సాధన చేసేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాయామం ద్వారా దేహదారుఢ్యాన్ని పెంపొందించుకోటానికి అయిదేళ్ల క్రితం జీవీఎంసీ అధికారులు బీచ్‌వద్ద ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేసి వివిధ పరికరాలు అమర్చారు. దీంతో ఇక్కడ పలు రకాల వ్యాయామాలు చేసేందుకు అవకాశం ఉండేది. ఉదయం వ్యాయామం చేసేందుకు వచ్చే వారితోపాటు సాయంత్రం వేళల్లో బీచ్‌కు విచ్చేసే సందర్శకులు వీటిమీద ఎక్కువగా సాధన చేసేవారు. ఎప్పటికప్పుడు వీటి నిర్వహణ చూడాల్సిన అధికారులు సరిగా పట్టించుకోకపోవడంతో క్రమేపీ ఇవి పాడయ్యాయి. కొన్నింటి బేరింగులు అరిగిపోయాయి. మరికొన్ని కిర్రుకిర్రుమంటూ శబ్దాలు వస్తున్నాయి. వీటికి సత్వరమే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.


భీమిలి బీచ్ వద్ద మరమ్మతులకు గురై నిరుపయోగంగా..

గ్రావెల్ రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు

ఆనందపురం, న్యూస్‌టుడే: రామవరం, బి.డి.పాలెం, కోలవానిపాలెం గ్రామాలను కలుపుతూ గండిగుండం మీదుగా పెందుర్తి వెళ్లే మార్గంలో ఎంపీ నిధులతో వేసిన గ్రావెల్ రోడ్డును ఆక్రమించారంటూ ఆయా గ్రామాలకు చెందిన కొంత మంది వ్యక్తులు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. రోడ్డు ఆక్రమణ వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉన్నతస్థానాల్లో స్థిరపడడానికి ఎన్‌సీసీ దోహదం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడి ఉన్నతస్థానాల్లో స్థిరపడడానికి ఎంతగానో దోహదపడుతుందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ జనరల్ ఎయిర్ కమొడోర్ వి.ఎం.రెడ్డి పేర్కొన్నారు. రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల వేదికగా 13 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణలో భాగంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎన్‌సీసీ ద్వారా చేకూరే ప్రయోజనాల్ని వివరించారు. అనంతరం అతిథుల్ని సత్కరించారు. జీవీపీ ప్రిన్సిపల్ ఆచార్య కె.ఎస్.బోస్, ఎన్‌సీసీ విభాగాధికారి కెప్టెన్ ఆర్.బి.అనంతరావు తదితరులు పాల్గొన్నారు.


వి.ఎం.రెడ్డిని సత్కరిస్తున్న జీవీపీ ప్రిన్సిపల్ ఆచార్య కె.ఎస్.బోస్ తదితరులు

'ఆర్ఐఎన్ఎల్' ఉత్పత్తులకు విశేష ఆదరణ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: శ్రేష్ఠత, నాణ్యతా ప్రమాణాల్లో రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) తయారు చేసే ఉత్పత్తులు పేరు ప్రఖ్యాతులు సంతరించుకున్నాయని ఆర్ఐఎన్ఎల్ మార్కెటింగ్ అధికారులు అజయ్‌సేన్, ఎ.కె.రామారావు, ద్వారం స్వామి పేర్కొన్నారు. నిర్మాణ రంగంలో అనవసర వ్యయాన్ని తగ్గించడానికి ఆర్ఐఎన్ఎల్ ఉత్పత్తుల వాడకం క్రమేపీ పెరుగుతోందన్నారు. గీతం డీమ్డ్ వర్సిటీ టెక్నాలజీ ఎనేబులింగ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వీరు ప్రసంగించారు. విశాఖ స్టీల్ ఉత్పత్తుల్లో వంద శాతం శ్రేష్ఠమైన ముడి పదార్థాల్ని ఉపయోగించడం వల్ల అంతర్జాతీయ ప్రమాణాల్ని అందుకుంటున్నట్లు వెల్లడించారు. గీతం సంబంధిత విభాగ డైరెక్టర్ ఆచార్య కె.నాగేంద్ర ప్రసాద్ తదితరులు కూడా మాట్లాడారు. అనంతరం అతిథుల్ని సత్కరించారు. వివిధ కోర్సుల విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ తూర్పు

3 కిలోల గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ మీదుగా తమిళనాడులోని మదురైకు గంజాయిని అక్రమంగా రవాణా చేసేందుకు యత్నించిన వ్యక్తిని విశాఖలో రైల్వే పోలీసులు అరెస్టు చేసినట్లు జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు. స్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ బృందాలు గస్తీ నిర్వహిస్తున్న సమయంలో మదురైకు చెందిన పి.జయంతి కాళిముత్తు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో ఆర్పీఎఫ్ ఎస్.కె. అబ్దుల్ మారూఫ్ బృందం అతన్ని పట్టుకుని బ్యాగ్‌లను తనిఖీ చేయగా గంజాయి పొట్లాలను గుర్తించారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి 3.250 కిలోల గంజాయిని సీజ్ చేసి నిందితుడ్ని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

-న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-8లో సత్యసాయి స్కూలు వద్ద చెట్టుకొమ్మలు వేలాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి - రూప

సమాధానం : పరిశీలించి చెట్టుకొమ్మలు తొలగిస్తాం - దామోదర్, ఉద్యానవనశాఖాధికారి

శాశ్వత పరిష్కారం చూపరూ..!

న్యూస్‌టుడే, ఉషోదయకూడలి (ఎంవీపీకాలనీ)

స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్న అధికారులు మానవ వ్యర్థాలు కలిసి సంబంధించిన మురుగునీరు ఎంవీపీకాలనీ సెక్టారు-11 గెడ్డలో కలుస్తున్నా యంత్రాంగంలో చలనం కనిపించటం లేదు. వర్షాలు వస్తే చాలు పరిసరాల్లోని యూజీడీ పొంగిపొర్లుతూ రహదారులపై మురుగు నీరు ప్రవహిస్తున్నా అధికారులు మాత్రం దీనికి శాశ్వత పరిష్కారం చూపటం లేదు.


కలుషితమవుతున్న గెడ్డ

కొత్త పైపులైన్ నిర్మించినా కానరాని ఫలితం.. ఎంవీపీకాలనీలోని పలు సెక్టార్ల నుంచి ఇంటింటికి కనెక్షన్ ఇచ్చిన యూజీడీ పైపులైన్ నేరుగా శాంతి ఆశ్రమం దరి పంపింగ్ స్టేషన్‌కు అనుసంధానం చేసి ఉంటోంది. ఎంవీపీకాలనీ సెక్టారు-11 నుంచి లాసన్స్‌బేకాలనీ మధ్య ప్రవహిస్తున్న గెడ్డపై వంతెన నిర్మాణాన్ని చాలా కాలం క్రితం నిర్మించారు. ఆ వంతెన నిర్మించిన సమయంలో కింద నుంచి వెళ్తున్న యూజీడీ పైపులైన్ దెబ్బతింది. దీంతో సెక్టారు-11 నుంచి పంపింగ్ స్టేషన్‌కు అనుసంధానం తెగిపోయింది.

● అయితే కాలక్రమేణా ఎంవీపీ సెక్టారు-11 దినదినాభివృద్ధి చెందటంతో ఇళ్లకు స్థానికంగా నివాసాలు, అపార్టుమెంట్లు పెరిగాయి. ప్రతీ ఇంటికి యూజీడీ కనెక్షన్ ఇచ్చినా, వర్షాలు వస్తే యూజీడీ పైపులైన్ నుంచి నీరు సాఫీగా పోకుండా వెనక్కి వస్తోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించిన ఎమ్మెల్యే పదేళ్ల క్రితం కొత్తగా యూజీడీ పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు.

● అయితే సాంకేతికపరమైన అంశాల్లో సరైన అవగాహన లేకపోవటంతో పైపులైన్ నిర్మాణం చేపట్టినా అది అనుసంధానం చేసిన పంపింగ్ స్టేషన్‌కు మురుగు నీరు సాఫీగా పోయేది కాదు. దీంతో మళ్లీ మొదటికే ఈ సమస్య రావటంతో అధికారులు చేసేది లేక, పైపులైన్ మధ్యలోనే ఆపేసి, సమీపంలోని గెడ్డకు అనుసంధానం చేశారు.


గెడ్డలోకి వదిలేస్తున్న మానవవ్యర్థాలు

● దీంతో నిత్యం కాలనీలోని ఇంటింటి నుంచి వచ్చే మానవ వ్యర్థాలు పంపింగ్ స్టేషన్‌కు కాకుండా నేరుగా గెడ్డలో కలుస్తున్నాయి. ఈ గెడ్డ ఇళ్లకు నుంచి

మానవ వ్యర్థాలతో కలుషితమవుతున్న గెడ్డ

నేరుగా సాగరానికి చేరుకుని దరి సముద్రంలోకి కలుస్తోంది. దీంతో గెడ్డతో పాటు సముద్రం కూడా మానవ వ్యర్థాలతో కలుషితమవుతోంది.

● పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పైపులైన్ నిర్మాణాన్ని మార్పు చేయాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనికి రూ. కోట్లలో వెచ్చించాల్సి రావటంతో ఈ ప్రాజెక్టును పక్కన పెట్టేశారు. దీంతో గెడ్డకు ఆనుకుని ఉన్న నివాసులకు దుర్వాసన తప్పటం లేదు. కొత్త పైపులైన్ నిర్మించాలని స్థానికులు ఎన్నాళ్లగానో కోరుతున్నా, పట్టించుకున్న వారు లేకపోవటంతో పరిస్థితి అలానే కొనసాగుతోంది. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తా



యూజీడీ అస్తవ్యస్తంగా ఉండటంతో ఇప్పటికే కొత్త ప్రాజెక్టు నిర్మాణం కోసం పురపాలక శాఖమంత్రి నారాయణతో చర్చించాను. ప్రస్తుతం పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా అప్పుఘర్ వద్ద ఉన్న మురుగునీటి శుద్ధికేంద్రం సామర్థ్యం పెంచే అవకాశాలున్నాయి. ఎంవీపీ సెక్టారు-11లోని యూజీడీ సమస్యకు సంబంధించి కొత్త పైపులైన్ కోసం ప్రతిపాదనలు చేయాలని కమిషనర్‌ను కోరుతాం.

-వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే

వాణిజ్య భవన పనులు పూర్తిచేయాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : సిరిపురం కూడలిలో నిర్మాణంలో ఉన్న మల్టీలెవల్ కార్ పార్కింగ్, వాణిజ్య భవనాన్ని వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ బుధవారం సందర్శించారు. క్షేత్రస్థాయిలో పర్యటనలో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న పనులను పరిశీలించారు. నిర్దిష్ట కాలపరిమితి విధించారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. నవంబరు నాటికి అన్ని విధాల వాణిజ్య సముదాయ పనులు పూర్తిచేసుకోవాలని గుత్తేదారు ప్రతినిధులకు సూచించారు. అనంతరం వి.ఎం.ఆర్.డి.ఎ. కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


భవన పనులు పరిశీలిస్తున్న వి.ఎం.ఆర్.డి.ఎ కమిషనర్ విశ్వనాథన్

వరద బాధితులకు విరాళం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో గత నెలలో సంభవించిన వరదల నేపథ్యంలో అక్కడి వారిని ఆదుకునేందుకు తమవంతు బాధ్యతగా ఆంధ్రవిశ్వవిద్యాలయం స్టాఫ్ కోఆపరేటివ్ సొసైటీ ముందుకు వచ్చింది. రూ.2 లక్షల చెక్కును ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు అందజేసి ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎన్.ఎం. యుగంధర్, కార్యదర్శి సీహెచ్ లక్ష్మణబాబు, ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె.కిరణ్‌కుమార్, డైరెక్టర్ ఆచార్య వి.సిద్ధయ్య, కె.సోమేశ్వరరావు, షేక్ ఖాదర్‌బాబా, డాక్టర్ జి.ఎల్.ఎస్.రవికుమార్, ఎన్.వి.గిరి తదితరులు పాల్గొన్నారు.


ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు చెక్కు అందిస్తున్న డాక్టర్ ఎన్.ఎం.యుగంధర్ తదితరులు

సహస్రనామార్చనం.. నిత్యకల్యాణ వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో బుధవారం పలు ఆర్జిత సేవలు వైభవోపేతంగా జరిగాయి. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. తులసీదళాలతో దేవతామూర్తులకు సహస్రనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

★ **సంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసాలు:** శరన్నవరాత్రుల్లో భాగంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అప్పన్న ఆలయంలో పలువురు భక్తులు చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిపించారు. అర్చకులు ఆలయ వ్రత మండపంలో లక్ష్మీ నారాయణులను అధిష్ఠింపజేసి విశేష పూజలు జరిపారు. చిన్నారులతో అక్షరాలు దిద్దించి హయగ్రీవుడికి పూజలు చేయించారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

చందన సమర్పణకు రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామికి చందనోత్సవం సందర్భంగా చందన సమర్పణ చేసేందుకు నగరంలోని విశాలాక్షినగర్ ప్రాంతానికి చెందిన ఎ.ఎస్.ప్రకాశరావు, లలిత దంపతులు బుధవారం రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో ఆలయ పర్యవేక్షకుడు త్రిమూర్తులుకు అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


దాతలకు విరాళం రశీదు అందిస్తున్న ఆలయ పర్యవేక్షకుడు త్రిమూర్తులు

నేడు సంగీత కచేరి

ఆటోమోటివ్, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో గురువారం సాయంత్రం విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సంగీత గాత్ర కచేరీ కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు ఎం.ఎస్. శ్రీనివాస్ తెలిపారు. విశాఖ నగరానికి చెందిన కె.సరస్వతీ విద్యార్థి నేతృత్వంలో గాత్రకచేరీ ఉంటుందన్నారు.

టోల్‌గేటు వివాదంలో ముగ్గురి అరెస్టు

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస-విజయనగరం రోడ్డులోని బోడమెట్టపాలెం ఎన్‌హెచ్ఏఐ టోల్‌గేటు వద్ద ఇటీవల జరిగిన కొట్లాటలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు భీమిలి సీఐ బి.సుధాకర్ తెలిపారు. మాక్సీక్యాబ్ డ్రైవర్ ఫిర్యాదు మేరకు బోడమెట్టపాలెం గ్రామానికి చెందిన లొడగల ఎర్రనాయుడు (23), సురేశ్ (21) ఈశ్వరరావు (25)లను అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. క్యాబ్ డ్రైవర్లకు, టోల్‌గేటు సిబ్బందికి ఇటీవల ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఈ వివాదంలో డ్రైవర్‌కు మద్దతుగా వారి యూనియన్, గ్రామస్థులు; టోల్‌గేటు సిబ్బందికి మద్దతుగా బోడమెట్టపాలేనికి చెందిన కొందరు వ్యక్తులు రావడంతో ఇరు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన భీమిలి పోలీసులు ఆ మేరకు చట్టప్రకారం చర్యలు చేపట్టారు.

రైతుబజారులో రాయితీ టమోటా అమ్మకాలు ప్రారంభం


టమోటా అమ్మకాలను ప్రారంభించిన సి.వి.పట్టాభిరామ్

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : టమోటా ధరలను నియంత్రించేందుకు రైతుబజారులో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై కిలో రూ.50 చొప్పున అమ్మకాలను ప్రారంభించారు. బుధవారం ఎంవీపీ రైతుబజారుకు సెలవైనా టమోటా అమ్మకాలు కొనసాగించారు. ఈ అమ్మకాలను తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సి.వి.పట్టాభిరామ్ ప్రారంభించారు. ప్రతీరోజూ విక్రయిస్తామని అధికారులు తెలిపారు. ఆధార్, రేషన్‌కార్డు చూపిస్తే, కుటుంబానికి రెండు కిలోల చొప్పున ఇస్తామన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్మశానంలో శ్రమదానం


శ్రమదానం చేస్తున్న తెదేపా శ్రేణులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : పన్నెండో వార్డు పరిధిలోని ఆరిలోవ కాలనీ హెల్త్‌సిటీ చివరి భాగంలో గల శ్మశానంలో బుధవారం వార్డు తెదేపా నాయకులు జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి శ్రమదానం నిర్వహించారు. పిచ్చి మొక్కలు తొలగించారు. రాళ్లు తీసివేశారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో రెండు జేసీబీలతో మట్టిదిబ్బలను చదునుచేశారు. ఒమ్మి అప్పలరాజు, పోలరావు, గాడి సత్యం, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న యాత్రీ నివాస్ నిర్మాణ పనులను నాణ్యత, నియంత్రణ విభాగ అధికారులు పరిశీలించారు. బుధవారం సాయంత్రం పలువురు సిబ్బందితో కూడిన బృందం యాత్రీ నివాస్‌కు వచ్చారు. వీరు నిర్మాణ భవనంలో ఉన్న సామగ్రిని, నిర్మాణాలకు సంబంధించిన అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం సామగ్రి కొనుగోలు చేశారా? లేదా అనేది పరిశీలించారు.


యాత్రీ నివాస్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

పోస్టల్ శాఖ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పోస్టల్ శాఖకు సంబంధించిన వివిధ పథకాలపై తపాలాశాఖ అధికారులు అవగాహన కల్పించారు. బీచ్‌రోడ్డులో బుధవారం ఉదయం తపాలాశాఖ జాతీయ వారోత్సవాలు పురస్కరించుకొని విశాఖపట్నం పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో 'ఫిట్ పోస్టు ఫిట్ ఇండియా' పేరుతో అవగాహన నడక నిర్వహించారు. నడకలో పోస్టల్ డిపార్టుమెంట్‌కు సంబంధించిన వివిధ పథకాల గురించి అవగాహన కల్పించారు. పోస్టల్ శాఖ సీనియర్ సూపరింటెండెంట్ డి.ఎస్.నాగేశ్వరరెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ కోమల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 200 మొక్కలు నాటారు.


పథకాలపై అవగాహన కల్పిస్తున్న పోస్టల్ విభాగం అధికారులు


బాలుర విభాగంలో...


బాలికల విభాగంలో..

ఉత్సాహంగా జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : విశాఖ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శివాజీపార్కు స్కేటింగ్ రింక్‌లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ పోటీల్లో స్కేటర్లు ఒకరినొకరు పోటీ పడుతూ తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. తొలి రోజు ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఫిగర్ విభాగంలో పోటీలు జరిగాయి. వయసుల వారీగా స్కేటర్లు పోటీపడ్డారు.

అమెరికన్ సెంటర్ మరింత బలోపేతం చేస్తాం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నెలకొల్పిన అమెరికన్ కార్నర్‌ను మరింత బలోపేతం చేస్తామని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. అమెరికన్ ఎంబసీ నుంచి బుధవారం వచ్చిన పబ్లిక్ డిప్లమసీ అధికారి ఎమీలియా, పబ్లిక్ ఎంగేజ్‌మెంట్ స్పెషలిస్ట్ సెంథిల్ కుమార్‌లతో ఆయన తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఏయూ గ్లోబల్ వర్సిటీగా నిలుస్తోందన్నారు. అమెరికన్ కార్నర్‌ను మరింత బలోపేతం చేస్తామన్నారు. అమెరికన్ ఎంబసీ అధికారులను వర్సిటీ తరపున వీసీ సత్కరించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు.


అమెరికన్ ఎంబసీ ప్రతినిధులను సత్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు

వైభవంగా గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో బుధవారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీదళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేశారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యార్థుల విజ్ఞాన యాత్ర

ఆరిలోవ, విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ దర్శన్, స్వర్ణాంధ్ర-2047 పేరిట కడప జిల్లా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు విద్యా విజ్ఞాన విహార యాత్రలో భాగంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను సందర్శించారని.. డీఈవో ఆదేశాల మేరకు వారికి వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వి.రత్నవల్లి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు బీచ్‌రోడ్డులోని పలు సందర్శనీయ ప్రాంతాలను చూశారు.


కురుసుర మ్యూజియం వద్ద విద్యార్థులు

సరస్వతీ నమస్తుభ్యం

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు


ఎంవీపీ సెక్టారు-6లో సరస్వతీదేవిగా పార్వతీదేవి


సరస్వతీ దేవిగా దర్శనం ఇస్తున్న హనుమంతువాక విజయదుర్గమ్మ


జ్ఞానసరస్వతిగా పోలమాంబ అమ్మవారు


నేతాజీనగర్‌లో ఉన్న శ్రీ లలితా పరమేశ్వరి దేవి ఆలయంలో..

ఎం.వి.పి.కాలనీ, విశాలాక్షినగర్, ఆరిలోవ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, న్యూస్‌టుడే : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. సెక్టారు-6లో పార్వతీదేవి సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాల్తేరు కూడలిలోని విజయదుర్గ అమ్మవారు సరస్వతీదేవిగా పూజలందుకున్నారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో సామూహిక సరస్వతీపూజలు, అక్షరభ్యాసాలు జరిపారు. భద్రం సామాజిక భవనంలో సాయి సుధాకర పూర్ణానందస్వామి ఆధ్వర్యంలో సరస్వతీపూజ జరిపారు. సెక్టారు-5 నివాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు జరిపారు. సెక్టారు-6 వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీమన్నారాయణ కోలాటం బృందం కోలాటాన్ని ప్రదర్శించారు.


మద్దిలపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు


సత్యసాయి ప్రేమసదన్‌లో..


ఎంవీపీ డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద నెలకొల్పిన అమ్మవారి విగ్రహాలు

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన


ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఏపీ ఎస్ఈబీ కాలనీ నివాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన వైభవంగా జరిపారు. సంఘం ప్రతినిధులు జీఎస్ఆర్ ప్రసాద్, సింహాద్రిరాజులు ఈ కుంకుమార్చనను పర్యవేక్షించారు. మహిళా విభాగం ప్రతినిధులు సుజని, సావిత్రి, మంజుల రాణిలు పర్యవేక్షించారు.


కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు

* దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు జరుపుతున్న బావరాజు నారాయణ మూర్తి, వీరభద్రమ్మ దంపతులను శిర్డీసాయి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ సత్యకుమార్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు జరిపారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో..

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం పరీక్షల విభాగంలో బుధవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య పద్మశ్రీ, దూర విద్యా కేంద్రం సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, కంప్యూటర్ సెంటర్ డీన్ ఆచార్య భాస్కరరెడ్డి సరస్వతి పూజ నిర్వహించారు.


ఏయూ పరీక్షల విభాగంలో సరస్వతీ పూజ చేస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఉద్యోగులు

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

ప్రాంగణ ఎంపికల్లో కొలువులు

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కొలువులు సాధించారు. బుధవారం కళాశాలలో కోరమండల్ ఇంటర్నేషనల్ ఫెర్టిలైజర్ కంపెనీ ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. మొత్తం పది మంది విద్యార్థులు బి.విజయ్‌కార్తిక్, ఎ.మోనిక్రిష్ణ, జె.శ్రావణశ్రీ, ఎ.గణేష్, డి.జగదీష్, వర్ష, జి.మోహనకుమార్, పి.లక్ష్మణరెడ్డి, జి.బాలాజీ, ఎ.వి.ఎన్.సురేష్ వర్మ, బి.షణ్ముఖరావు ఉద్యోగాలు పొందారు. వారంతా తొలి ఏడాది రూ.రెండు లక్షలు, రెండో ఏడాది రూ.మూడు లక్షల వరకు జీతం అందుకోనున్నారు. ఇద్దరు విద్యార్థినులు మోనిక్రిష్ణ, శ్రావణశ్రీని తొలిసారిగా ఈ కంపెనీకి ఎంపికవ్వడం గమనార్హం. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ నియామకపత్రాలు అందజేసి అభినందించారు. విభాగాధిపతులు డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, కె.బి.వి.ఎస్.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నృత్యగాన కార్యక్రమం

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కులో గురువారం సాయంత్రం 6గంటలకు మార్గాదే నృత్యగాన కార్యక్రమం, తిరుమల బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న చిన్నారులకు అభినందన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
విశాఖ ఉత్తరం: 80747 24699
విశాఖ దక్షిణం: 80085 66543

న్యూస్‌టుడే, జ్ఞానాపురం

సమస్య: జీవీఎంసీ 41వ వార్డు కాన్వెంట్ కూడలి టీబీఆర్‌వీ ప్రధాన రహదారిపై అడ్డంగా చెత్త సేకరణ డబ్బాను పెట్టారు. – డి.ప్రసాద్, జ్ఞానాపురం

సమాధానం: ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.– డాక్టర్ సునీల్, ఏఎంహెచ్‌వో, జోన్-5

అవీ ఇవీ

రాయితీ టమాట విక్రయాలు

గురుద్వారా, న్యూస్‌టుడే : సీతమ్మధార రైతుబజార్‌లో బుధవారం ప్రత్యేక కౌంటర్ ద్వారా రాయితీ టమాటాలు విక్రయించారు. కిలో రూ.50 చొప్పున ఒక్కో వినియోగదారుడికి రెండు కిలోలు మాత్రమే అందించారు. తొలిరోజు ఐదు టన్నుల టమాటా విక్రయించారు. మార్కెటింగ్ శాఖ డీడీ కిరణ్ టమాటా విక్రయాలను పరిశీలించారు. ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ

గురుద్వారా, న్యూస్‌టుడే : కాలికి గాయమై చికిత్స పొందుతున్న ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును బుధవారం ఎంపీ భరత్, తెదేపా విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ పరామర్శించారు.

అమ్మవారి నగదు దండల చోరీ

గురుద్వారా, న్యూస్‌టుడే : దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి అలంకరించిన నగదు దండలు చోరీకి గురైన ఘటన రైల్వేన్యూకాలనీలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీ మసీదు సమీప మండపంలో అమ్మవారికి సోమవారం రాత్రి రూ.75వేల కరెన్సీ నోట్లతో దండలు వేశారు. మంగళవారం ఉదయానికి అవి మాయమయ్యాయి. నిర్వాహకులు స్థానికంగా ఆరా తీసినా, ప్రయోజనం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

గురుద్వారా, న్యూస్‌టుడే : గురుద్వార సమీపంలోని ఓ బహుళ అంతస్తు భవనంలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు బుధవారం ద్వారకా పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.1.08 లక్షలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

3 కిలోల గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ మీదుగా తమిళనాడులోని మదురైకు గంజాయిని అక్రమంగా రవాణా చేసేందుకు యత్నించిన వ్యక్తిని విశాఖలో రైల్వే పోలీసులు అరెస్టు చేసినట్లు జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు. స్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ బృందాలు గస్తీ నిర్వహిస్తున్న సమయంలో మదురైకు చెందిన పి.జహీంత్ కాలిముత్తు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో ఆర్పీఎఫ్ ఎస్.ఐ. కె.అబ్దుల్ మారూఫ్ బృందం అతన్ని పట్టుకుని బ్యాగ్‌లను తనిఖీ చేయగా గంజాయి పొట్లాలను గుర్తించారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి 3.250 కిలోల గంజాయిని సీజ్ చేసి నిందితుడ్ని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

'డైలాగ్ అండ్ డెమోక్రసీ' పుస్తకావిష్కరణ

సీతంపేట, న్యూస్‌టుడే: విశాఖ పౌరగ్రంథాలయం, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ సంయుక్తంగా బుధవారం సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో 'డైలాగ్ అండ్ డెమోక్రసీ' అయిదో సంపుటిని కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇ.ఎ.ఎస్.శర్మ ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో యువత ప్రశ్నించేతత్వం అలవరచుకోవాలన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ వ్యవస్థాపకులు ఆచార్య ప్రసన్న కుమార్ మాట్లాడుతూ డైలాగ్ అండ్ డెమోక్రసీ అనే సిరీస్ గత 15 ఏళ్ల నుంచి కొనసాగుతూ వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పౌరగ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథి శర్మను ఘనంగా సత్కరించారు.



సదస్సులో మాట్లాడుతున్న ఇ.ఎ.ఎస్.శర్మ

జాతికి స్ఫూర్తినిచ్చిన గొప్ప కవి దాశరథి

సీతంపేట, న్యూస్‌టుడే: సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో దాశరథి కృష్ణమాచార్యులు కవిత్వంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కె.జి.వేణు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ దాశరథి జాతికి స్ఫూర్తినిచ్చే గొప్ప కవిత్వం రాసిన జాతీయ కవి, స్వాతంత్ర్య సమర యోధుడు అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, సీహెచ్ చినసూర్యనారాయణ, కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, భాగవతుల సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య వెలమల సిమ్మన్న

భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన భవనం ప్రారంభం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: దొండపర్తి సమీప కుమ్మరివీధి వంతెన వద్ద ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎ.ఐ.టి.యు.సి.) నూతన కార్యాలయ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎ.పి. భవన నిర్మాణ కార్మిక సంఘం, ఎ.ఐ.టి.యు.సి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తూ అనేక సమస్యలతో సతమతమవుతున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ కార్యాలయం ఓ ప్రధాన కేంద్రం కావాలన్నారు. జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు కోట సత్తిబాబు, నాయకులు పిళ్లా రమణ తదితరులు పాల్గొన్నారు.


భవనాన్ని ప్రారంభిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న కాళీ మందిరంలో వాల్తేర్ కాళీ బరి, సర్బోజనిన్ తూ.కో రైల్వే దుర్గా పూజా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దేవీ పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్, సీనియర్ డీఓఎం తన్మయ్ ముఖోపాధ్యాయ్ తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న డీఆర్ఎం మాట్లాడుతూ కాళీ బరిలో 64 ఏళ్లుగా దుర్గా పూజలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ముద్రించిన ప్రత్యేక సంచికను ఆయన ఆవిష్కరించారు.


కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలు

పూర్ణామార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వెలంపేట శ్రీ దుర్గామ్మ దేవస్థానం ఆలయంలోని శ్రీ దుర్గ అమ్మ అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులు బుధవారం దర్శనమిచ్చారు.



వన్‌టౌన్, న్యూస్‌టుడే: విజయవాడ కనక దుర్గమ్మను దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రూ.11 లక్షల విలువైన వెండి నైవేద్య సామగ్రిని అమ్మవారికి ఎమ్మెల్యే దంపతులు, వ్యాపారవేత్త విక్కీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.


వెండి సామగ్రితో ఎమ్మెల్యే వంశీకృష్ణ, విక్కీ తదితరులు

మాధవధార, న్యూస్‌టుడే : దసరా నేపథ్యంలో బుధవారం మాధవధార ల్యాన్‌సమ్ ప్రాంగణంలో బాలలకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ★ జీవీఎంసీ 51వ వార్డు సీతన్నగార్డెన్స్ కనకదుర్గాదేవి ఆలయంలో పూజలు చేశారు. అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.


ల్యాన్‌సమ్ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో...

కార్పొరేషన్, న్యూస్‌టుడే : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పాతనగరంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ★ డాబాగార్డెన్స్ సమీపంలోని ఉమాదేవి ఆలయంలో బుధవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చదువుల తల్లికి జన నీరాజనం



వన్‌టౌన్, న్యూస్‌టుడే: 29వ వార్డు పరిధిలోని అంగటి దిబ్బ ప్రాంతంలో లక్కీ యూత్‌బాయ్స్ ఆధ్వర్యంలో బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రసాదాలను స్వీకరించారు.



మురళీనగర్, న్యూస్‌టుడే: స్థానిక సీతారామాలయంలో బుధవారం లలితాదేవిని సరస్వతీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గురుద్వారా, న్యూస్‌టుడే : సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్సన్ దరి సాయి బాబా మందిరంలో దుర్గాదేవి నవరాత్రి, శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. సాయంత్రం స్వామిని వరాహనరసింహునిగా, అమ్మవారిని మహాలక్ష్మిదేవిగా అలంకరించారు.




అక్షరాభ్యాసంలో చిన్నారులు, తల్లిదండ్రులు

గురుద్వారా: ఏపీఎస్‌ఈబీకాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం దసరా ఉత్సవాల్లో భాగంగా మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కాలనీ సంఘం కార్యదర్శి కె.సత్తిరాజు, వైస్ ప్రెసిడెంట్ కె.రామారావు, కోశాధికారి కె.పి.శ్రీపతి, తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట, న్యూస్‌టుడే: 25వ వార్డు గణేష్‌నగర్ దుర్గాదేవి మహిళా కమిటీ ఆధ్వర్యంలో సీతంపేటలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక, సునీల్ దంపతులు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ తదితరులు పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు.


49వ వార్డు బర్మా క్యాంప్ జైభారత్ నగర్‌లో..


సీతంపేట శ్రీపార్వతీశ్వర ఆలయంలో..


ఊర్వశికూడలి శ్రీదుర్గమాంబ, శ్రీకుంచుమాంబ అమ్మవార్ల గుడిలో..



అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: నరసింహనగర్ శివారు ప్రాంతమైన గణేష్‌నగర్ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో బుధవారం సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు.


కంచరపాలెం, న్యూస్‌టుడే: రెడ్డికంచరపాలెం సన్‌రైజ్‌క్లబ్ వద్ద..

పర్యావరణ హితం.. సౌర విద్యుత్ వినియోగం

మురళీనగర్, న్యూస్‌టుడే: గృహ వినియోగదారులను సౌర విద్యుత్ వినియోగం వైపు మళ్లించి పర్యావరణాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని అమలు చేస్తోందని ఏపీ ఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు పేర్కొన్నారు. జాతీయ రహదారి గంగా గోదావరి ఉడా బహుళ అంతస్తుల భవన సముదాయంలోని ప్రజలకు బుధవారం సౌర విద్యుత్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపై సౌర పలకలు అమర్చి పగలంతా సౌర విద్యుత్‌ను ఉపయోగించుకుని రాత్రిపూట డిస్కంలకు సరఫరా చేసేలా ఈ పథకాన్ని రూపొందించారన్నారు. పర్యావరణానికి హితం చేసే ఈ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ రాయితీతో పాటు తక్కువ వడ్డీకే బ్యాంకుల నుంచి రుణ సదుపాయం పొందవచ్చునన్నారు. ఈ సందర్భంగా నివాసితులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో విద్యుత్ సహాయ ఇంజినీర్(ఆపరేషన్స్) జి.వెంకటేశ్వరరావు, ఏఈ జె.వి.రమణ, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, టాటా సోలార్ ప్రతినిధి మహ్మద్ అక్బర్, నివాసితుల సంఘం అధ్యక్షులు యర్రయ్య, ఎం.వి.రమణ పాల్గొన్నారు.


నివాసితులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు


విజయం సాధించిన జీవీఎంసీ క్రికెట్ జట్టు సభ్యులు

జీవీఎంసీ జట్టు విజయం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : వీడీసీఏ ఇన్‌స్టిట్యూషన్స్ గ్రూప్ మ్యాచ్‌లో జీవీఎంసీ క్రికెట్ టీం పది వికెట్ల తేడాతో వీపీటీఎస్సీ టీంపై విజయం సాధించింది. కోర్టు మైదానంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వీపీటీఎస్సీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 97 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జీవీఎంసీ టీం 13.4 ఓవర్లలోనే 100 పరుగులు వికెట్ నష్టపోకుండా చేసి అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా క్రీడాకారులను అదనపు కమిషనర్ రమణ మూర్తి, టీం మేనేజర్ సన్ని అభినందించారు.

రోడ్లపై వ్యర్థాలు పారబోస్తే జరిమానా

మాధవధార, న్యూస్‌టుడే : రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పారబోస్తే కఠిన చర్యలు తప్పవని జోన్-5 జెడ్సీ బి.రాము హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఆయన మాధవధార పరిసరాల్లో పర్యటించారు. స్థానిక 60 అడుగుల రహదారిపై ఉన్న వ్యర్థాలను చూసి, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటింటికీ వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు వ్యర్థాలు అందజేయాలని, లేదా చెత్తకుండీలో వేయాలని స్థానికులకు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పారబోసే వారిపై నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.


మాధవధారలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జెడ్సీ బి.రాము

ఆలయ ముఖద్వార ప్రారంభోత్సవం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జగన్నాథపురంలోని ముగ్గురు అమ్మవార్ల ఆలయాల ముఖద్వార ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అక్కయ్యపాలెం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ద్వారాన్ని ఎంపీ శ్రీభరత్, తెదేపా నాయకుడు గండి బాబ్జీ అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. 43వ వార్డు తెదేపా అధ్యక్షుడు బొడ్డేటి మోహన్, స్థానిక నాయకులు బుద్ధ శివాజీ, కొయిలాడ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీ శ్రీభరత్, చిత్రంలో గండి బాబ్జీ తదితరులు

జెట్టీల ఫీజులను రద్దు చేయాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కరోనా సమయంలో మరపడవలు వేటకు వెళ్లలేదని, ఆ సమయానికి చెల్లించాల్సిన జెట్టీల ఫీజులను రద్దు చేయాలని, లేకుంటే వన్ టైమ్ సెటిల్‌మెంట్‌కు అవకాశం కల్పించాలని ఏపీ మరపడవల ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు కోరారు. చేపలరేవులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బోటు యజమానులు జీఎస్టీ, వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని, జెట్టీ ఫీజులపై పోర్టు అథారిటీ ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు. ఒక్కో బోటుకు ఏడాదికి రూ.12 వేలకు పైగా ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. చేపలరేవును రూ.152 కోట్లతో నవీకరణ చేస్తున్న నేపథ్యంలో తక్షణమే భద్రతా వ్యవస్థలను పటిష్టం చేసి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. షిప్పింగ్ కాంప్లెక్సులో బోట్ల మరమ్మతులకు ఒక క్రేన్, మూడు ట్రాలీలను అందుబాటులో ఉంచాలన్నారు. నవంబరు 21న మత్స్యకార దినోత్సవం జరపనున్నందున వేట విరామ సమయంలో మత్స్యకారులకు చెల్లించాల్సిన భరోసా మొత్తాన్ని విడుదల చేయాలన్నారు. ఆయిల్ రాయితీ రూ.3 కోట్లు విడుదల చేయాలన్నారు. డీజిల్‌పై లీటరుకు ప్రస్తుతం ఇస్తున్న రూ.9ల రాయితీని రూ.15లకు పెంచాలన్నారు. బయోడీజిల్ ధర లీటర్‌కు రూ.2లు తగ్గించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న లక్ష్మణరావు

నిరసన సభకు సంఘీభావం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: కుల గణన చేపట్టాలని విజయవాడలో ధర్నా చౌక్ వద్ద బుధవారం జరిగిన నిరసనలో విశాఖపట్నం జిల్లా బహుజన సమాజ్ పార్టీ (బి.ఎస్.పి.) నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు పెదపెంకి శివప్రసాద్, రాష్ట్ర కోఆర్డినేటర్ కె.రాజారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు, ఇతర నాయకులు బోని కృష్ణ, భీమరశెట్టి విశ్వనాథం, అరుగుల ధనుంజయరావు, తదితరులు సంఘీభావం తెలియజేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఓబీహెచ్ఎస్ కార్మికులకు గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు తక్షణమే చెల్లించాలని కోరారు. తూ.కో.రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తున్నారని అవి కూడా సకాలంలో చెల్లించడం లేదని ఆరోపించారు. లేబర్ చట్టం ప్రకారం కార్మికులకు జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్ఎంను కోరారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు బి.జగన్, అప్పారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


డీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న గంగారావు తదితరులు

పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరించొద్దు

జగదాంబ కూడలి,(కార్పొరేషన్) న్యూస్‌టుడే : పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరించే చర్యలను నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కోరారు. బుధవారం జగదాంబ సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోర్టు నిధులతోనే ఆసుపత్రి అభివృద్ధి చేసి, కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలన్న డిమాండ్‌తో 11న ఆసుపత్రి వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. విలేకరుల సమావేశంలో సీఐటీయూ నాయకులు ఆర్‌కెఎస్‌వీ కుమార్, ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: పోర్టు ఆసుపత్రి పి.పి.పి.బిడ్స్ తక్షణం రద్దు చేయాలని సీఐటీయూ పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కో కన్వీనర్ కె.కుమార్ మంగళం డిమాండ్ చేశారు. విశాఖ పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ నిలిపివేయాలని కోరుతూ సాలగ్రామపురం పోర్టు ఆసుపత్రి వద్ద తొమ్మిది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులను బుధవారం ఆయన కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఆసుపత్రిని ప్రయివేటీకరణ చేసేందుకు యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం కుట్ర చేయడం దారుణమని విమర్శించారు. యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు అన్ని సంఘాలు మద్దతు తెలపాలని కోరారు. పలువురు యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


శిబిరం వద్ద మాట్లాడుతున్న కె.కుమార్ మంగళం

వివరాల నమోదు తప్పనిసరి

గురుద్వారా, న్యూస్‌టుడే : 'అభ యాప్'లో రోగుల వివరాలు శతశాతం నమోదు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. బుధవారం ఆయన 24వ వార్డు రేసపువానిపాలెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధి హరిజన వీధి సచివాలయాన్ని సందర్శించారు. ఆధార్ నంబరు లేకపోతే సంబంధిత ఆశా కార్యకర్తతో గృహ సందర్శన చేసి అభయాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. చిన్నారుల టీకాల అమలుపై ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రం వైద్యులు మన్మోహన్, నాగభూషణం, ఎంపీహెచ్ఈఓ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్ఓ జగదీశ్వరరావు

టూటౌన్‌లో దస్త్రాల పరిశీలన

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలోని రెండో పట్టణ పోలీసు స్టేషన్‌ను బుధవారం సాయంత్రం డీసీపీ అజిత వేజెండ్ల సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్టేషన్‌లోని దస్త్రాలను, కేసులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి కేసుల వివరాలను తెలుసుకున్న ఆమె త్వరితగతిన కేసులు పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలపైనా ఆమె ఆరా తీశారు.

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

అనాథలకు సాయహస్తం


కార్యక్రమంలో పాల్గొన్న బాలలు, ప్రతినిధులు

గాజువాక, న్యూస్‌టుడే : సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అమెరికాకు చెందిన తెలుగు అసోసియేషన్ ఆఫ్ అర్కాన్సాస్ ఆధ్వర్యంలో బుధవారం గాజువాక జనరేషన్ యువ అనాథ బాలల ఆశ్రమానికి చేయూతనిచ్చారు. మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలు, బాలలకు విద్యా సామగ్రి అందించారు. అసోసియేషన్ ప్రతినిధి గొండేల సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టోల్‌గేటు వివాదంలో ముగ్గురి అరెస్టు

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస-విజయనగరం రోడ్డులోని బోడమెట్టపాలెం ఎస్‌హెచ్‌ఐ టోల్‌గేటు వద్ద ఇటీవల జరిగిన ఘర్షణలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు భీమిలి సీఐ బి.సుధాకర్ తెలిపారు. మార్కెట్ డ్రైవర్ ఫిర్యాదు మేరకు బోడమెట్టపాలెం గ్రామానికి చెందిన లొడగల ఎర్రనాయుడు (23), సురేష్ (21) ఈశ్వరరావు (25)లను అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. కార్ డ్రైవర్లకు, టోల్‌గేటు సిబ్బందికి ఇటీవల ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఈ వివాదంలో డ్రైవర్లకు మద్దతుగా వారి యూనియన్, గ్రామస్థులు; టోల్‌గేటు సిబ్బందికి మద్దతుగా బోడమెట్టపాలెంకి చెందిన కొందరు వ్యక్తులు రావడంతో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన భీమిలి పోలీసులు ఆ మేరకు చట్టప్రకారం చర్యలు చేపట్టారు.

పారదర్శకంగా మద్యం దుకాణాలు

• దరఖాస్తుల వడపోత షురూ..!
• 'న్యూస్‌టుడే'తో ఎక్సైజ్ సీఐ

న్యూస్‌టుడే, గాజువాక



ప్రభుత్వ నిబంధనలు అనుసరించి గాజువాక సర్కిల్‌లో కొత్తగా మద్యం దుకాణాల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు గాజువాక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.నాగశ్రీనివాసరావు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చురుగ్గా సాగుతోందని, నూతన మద్యం విధానం ద్వారా కొత్త దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన 'ఈనాడు' ముఖాముఖీలో పలు అంశాలు వెల్లడించారు.

రెండేళ్ల కాలపరిమితితో ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని ప్రకటించింది. ఈనెల 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం. కలెక్టర్ ఆదేశాలతో ఇప్పటికే డిజిటల్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసుకుని, ఆన్‌లైన్‌లో దరఖాస్తుదారుడి వివరాలు నమోదు చేస్తున్నాం. నకిలీ డీడీలు, చెక్కులను అరికట్టడానికి బ్యాంకు సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నాం. ఈనెల 14న ఏయూలోని డిబ్బన్ ఏరినాలో జిల్లా కలెక్టర్ సమక్షంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో లాటరీ తీసి అర్హులకు దుకాణాలు కేటాయిస్తాం.

ముఖాముఖి

వెయ్యికి పైగా దరఖాస్తులు: విశాఖ జిల్లాను పరిగణలోకి తీసుకుని దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అన్ని స్టేషన్లలో జరుగుతోంది. జిల్లాలో మొత్తం 155 దుకాణాలు ఏర్పాటు చేస్తుండగా... ఇప్పటికే వెయ్యికి పైగా దరఖాస్తులు వచ్చాయి. తొలి విడత ఏడాదికి ఒక్కో దుకాణానికి లైసెన్స్ ఫీజు కింద రూ. 85 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. రెండో ఏడాది 10 శాతం ఫీజు పెంపు ఉంటుంది. లైసెన్స్ ఫీజును ఏడాదిలో ఆరు విడతల్లో చెల్లించవచ్చు.

సిండికేట్ల ప్రమేయం లేదు: గాజువాక పరిధిలో గతంలో ఉండే 32 మద్యం అవుట్‌లెట్లు ప్రకారంగానే కొత్త దుకాణాలు రాబోతున్నాయి. దరఖాస్తుదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలకు తావు ఉండదు. మద్యం సిండికేట్ల ప్రమేయం ఎక్కడా లేదు.

ఈనెల 16 నుంచి...: లాటరీ ద్వారా దుకాణాలు పొందినవారు ఈనెల 16వ తేదీ నుంచి అమ్మకాలు ప్రారంభించొచ్చు. దుకాణాలు దక్కని వారు దరఖాస్తు ఫీజు రూ. 2 లక్షలు తిరిగిరాదు. ఆ మొత్తం ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది.

11వ తేదీతో గడువు ముగింపు..: ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గాజువాక ఎక్సైజ్ స్టేషన్ దరఖాస్తుల స్వీకరణ గడువు ఉంటుంది. గడువు లోపు వచ్చి ఆన్‌లైన్‌లో దరఖాస్తు వివరాలు నమోదు చేయించుకుని, డీడీలు చెల్లించిన వారి పేర్లే లాటరీ జాబితాలో ఉంటాయి. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.


వివరాలు నమోదు ఎక్సైజ్ సిబ్బంది

చేతిపంపు.. నీరొచ్చేదెప్పుడు..!

దర్పణం

జీవీఎంసీ 62వ వార్డు ఏఎస్ ఆర్ కాలనీ కొండ వాలు పై ఏర్పాటు చేసిన 49/52 నంబరు గల చేతిపంపు కొద్ది నెలల నుంచి పని చేయడం లేదు. దీంతో స్థానికులు నిత్యం నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్నా... సిబ్బంది పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి... మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, మల్కాపురం



'నిఘా కళ్లు' తెరుచుకున్నాయ్..!

న్యూస్‌టుడే, సింధియా(జవహర్‌నగర్): పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం స్టేషన్ పరిధిలోని ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాల బిగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాల్లో ఆధారాల సేకరణకు, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించే వారిని గుర్తించేందుకు, చోరుల ఆటకట్టించేందుకు కెమెరాలు ఉపకరిస్తాయని హార్బర్ జోన్ ట్రాఫిక్ సీఐ ఎస్. షణ్ముఖరావు, ఎస్సై జి.అప్పారావు తెలిపారు. బుధవారం శ్రీహరిపురం, జవహర్ నగర్ పరిసరాల్లో కెమెరాలు బిగించారు.


కెమెరాలు బిగిస్తున్న సిబ్బంది

సకాలంలో ఇంటి పన్ను చెల్లించాలి

కరాస, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను రుసుము సకాలంలో చెల్లించాలని, నూతన గృహాలకు పన్నులు వేయించుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సూచించారు. బుధవారం 57వ వార్డు సుభాష్‌నగర్‌లో నిర్వహించిన ఇంటిపన్ను మేళాలో ఆయన మాట్లాడారు. పన్ను చెల్లింపులకు సంబంధించి సమస్యల పరిష్కారానికి జీవీఎంసీ మేళాలు ఉపకరిస్తాయన్నారు. అనంతరం మేళాకు హాజరైన స్థానికులకు అధికారులు సేవలు అందించారు. జోన్-5 కమిషనర్ రాము, ఇతర రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, నాయకులు అజయ్‌బాబు, వై.తిరుమలరావు, కుక్క కార్తీక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ధరల నియంత్రణపై దృష్టి

గోపాలపట్నం(ఆర్.ఆర్.వి.పురం), న్యూస్‌టుడే : ధరల నియంత్రణపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. బుధవారం గోపాలపట్నం రైతుబజారులో కిలో రూ.50కు రాయితీ ధరపై టమాటా విక్రయాలు ప్రారంభించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వివిధ అంశాలపై మార్కెటింగ్ శాఖ అధికారుల వద్ద ఆరా తీశారు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ కిరణ్, ఇన్‌ఛార్జి డీడీఎంఓ రాకేశ్, మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి సోపారావు, ఎస్టేట్ అధికారి డి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

?: గాజువాక సమీప కొత్తకర్ణవానిపాలెం నుంచి పంటిల్లు మాదిలికి వెళ్లే మార్గంలో గోతులు ఉన్నాయి. -మంగరాజు, గాజువాక
సమాధానం : పరిశీలించి, మరమ్మతులు చేయిస్తాం. -అప్పారావు, ఈఈ

?: సింహగిరికాలనీ 3వ లైన్లో 41జీ 21, 22 వీధి దీపాలు వెలగడం లేదు. -సన్యాసిరావు, గాజువాక
✓: సిబ్బందిని పంపి, దీపాలు బాగు చేయిస్తాం. -శివ, వీధి దీపాల నిర్వాహకుడు

సంక్షిప్త సమాచారం..

• కార్డుల మంజూరుకు విన్నపం

అగనంపూడి, న్యూస్‌టుడే : ఉక్కులో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రభుత్వం ఆధ్వర్యంలో తెల్ల రేషన్‌కార్డులు మంజూరు చేయాలని అగనంపూడి ప్రాంత అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వి.భాస్కర్‌రావును నగరంలో కలిసి విన్నవించారు. ఉక్కు విశ్రాంత ఉద్యోగులకు ఈపీఎస్ పింఛను నెలకు రూ. 4 వేలు మాత్రమే వస్తుందని, ప్రభుత్వ పథకాలు పొందేందుకు వీలుగా కార్డులు ఇవ్వాలని కోరారు. అఖిలపక్ష నాయకులు బి.సత్యనారాయణ, ఎం.రామచంద్రరావు, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన నేవీ వాహనం

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం శ్రావణ్ షిప్పింగ్ నుంచి పోర్టు రోడ్డుకు వెళ్లే మార్గంలో ప్రయాణిస్తున్న లారీని నేవీ వాహనం ఢీకొట్టిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో నేవీ వాహనం ముందు భాగం ధ్వంసమైంది. ఈ ప్రమాదంపై గాజువాక పోలీసుల వద్ద ప్రస్తావించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.


దెబ్బతిన్న వాహనం

• జీవీఎంసీ జట్టు విజయం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : వీడీసీఏ ఇన్‌స్టిట్యూషన్స్ గ్రూప్ మ్యాచ్‌లో జీవీఎంసీ క్రికెట్ టీం పది వికెట్ల తేడాతో వీపీటీఎస్సీ టీంపై విజయం సాధించింది. కోర్టు మైదానంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వీపీటీఎస్సీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 97 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జీవీఎంసీ టీం 13.4 ఓవర్లలోనే 100 పరుగులు వికెట్ నష్టపోకుండా చేసి అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా క్రీడాకారులను అదనపు కమిషనర్ రమణమూర్తి, టీం మేనేజర్ సన్ని అభినందించారు.

• అమ్మవారి నగదు దండల చోరీ

గురుద్వారా, న్యూస్‌టుడే : దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి అలంకరించిన నగదు దండలు చోరీకి గురైన ఘటన రైల్వే న్యూకాలనీలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీ మసీదు సమీప మండపంలో అమ్మవారికి సోమవారం రాత్రి రూ. 75వేల కరెన్సీ నోట్లతో దండలు వేశారు. మంగళవారం ఉదయానికి అవి మాయమయ్యాయి. నిర్వాహకులు స్థానికంగా ఆరా తీసినా, ప్రయోజనం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


సాగరగిరిపై..


కొత్తపాలెంలో..


చినములగాడలో..


ఎల్‌వీనగర్‌లో..


వాంబేకాలనీలో..



డ్రైవర్స్‌కాలనీలో..


చినగంట్యాడలో..


అగనంపూడిలో..


తుంగ్లాంలో..


ఎల్ఎన్ గార్డెన్స్‌లో..


ఉక్కు త్రిశక్తి ఆలయంలో..

చదువుల తల్లి.. భక్తజనం ప్రణమిల్లి..!

సరస్వతి దేవికి పూజలు చేసిన బాలలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గాజువాక, పశ్చిమం నియోజకవర్గాల్లో ఆలయాలు, మండపాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాలలకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాలను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.
-న్యూస్‌టుడే, గాజువాక, విశాఖ పశ్చిమం బృందం


రాసాలమ్మకాలనీలో..


అక్కిరెడ్డిపాలెంలో..


శతవాహన నగర్‌లో..


కోడిపందాలదిబ్బలో..


ఏఎస్ఆర్‌కాలనీలో..


ఉక్కునగరంలో..


పద్మనాభనగర్‌లో..

పని చేసే వారికి ప్రాధాన్యం


వివరాల నమోదులో భాజపా నాయకులు

గాజువాక, న్యూస్‌టుడే : భాజపా బలోపేతానికి కష్టపడి పని చేసే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని, పార్టీ అధిష్ఠానం యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తుందని గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. బుధవారం 70వ వార్డు కుంచమాంబ కాలనీలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 15 వరకు నమోదు కొనసాగిస్తామన్నారు. పార్టీ నగర ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు, వార్డు అధ్యక్షురాలు పావని, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం ములగాడ మండల పరిధిలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఆసక్తి ఉన్న వారంతా గడువులోపు పార్టీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మండల అధ్యక్షులు కౌవులూరి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన నిర్మాణాలు ప్రారంభం


కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా, తదితరులు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజా భాగస్వామ్యం ఉండాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం 75వ వార్డు నెల్లిముక్కులో సుమారు రూ. 20 లక్షలతో నిర్మించిన సామాజిక భవనం, ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ... ప్రజా అవసరాల కోసం నిర్మించిన నిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్పొరేటర్ లక్ష్మీబాయి, తెదేపా నాయకులు వెంకటరమణారెడ్డి, శ్రీనివాసరావు, చిన అప్పారావు, పెంటయ్య, పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగ భద్రత కల్పించాలి'

గాజువాక, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ వాలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం గాజువాకలో నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ముందుగా పాతగాజువాక నుంచి జోనల్ కార్యాలయం వరకు పలువురు సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినదించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దీప్తి, సీపీఎం జోనల్ కార్యదర్శి ఎం. రాంబాబు మాట్లాడుతూ... ప్రజలకు ఎన్నో సేవలు అందించిన వాలంటీర్లను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టడం బాధాకరమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సంఘం సభ్యులు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


గాజువాకలో నినాదాలు చేస్తున్న వాలంటీర్లు

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక


మాజీ ప్రిన్సిపల్ సీతాలక్ష్మిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కరాస, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తిలో మెరుగైన బోధన సాగిస్తూ, విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని ఆరిలోవ హిందీ శిక్షణ కళాశాల మాజీ ప్రిన్సిపల్ సీతాలక్ష్మి అన్నారు. కళాశాలకు చెందిన 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం మద్దిపాలెం వుడాలే అవుట్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ పిన్సిపల్‌ను సత్కరించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఆచార్యులు రాధాకుమారి, నీలిమ, సత్యనారాయణ పాల్గొన్నారు.

అవగాహనతో క్యాన్సర్ నిర్మూలన

గాజువాక, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉంటే, ప్రాణాంతకమైన క్యాన్సర్‌ను నిర్మూలించొచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం గాజువాక జోనల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైద్య బృందం హాజరై... పారిశుద్ధ్య సిబ్బందికి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లు రామారావు, తాతారావు, కోటేశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.


శిబిరంలో హోమీ బాబా క్యాన్సర్ ఆసుపత్రి ప్రతినిధులు

'సెయిల్‌లో విలీనం చేయాల్సిందే..!'

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేసి, కార్మిక భద్రత కల్పించాలని పోరాట కమిటీ నాయకుడు ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే దీక్షలు బుధవారం 1136వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమను కాపాడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకోవాలన్నారు. ఇదే అంశంపై కేంద్రాన్ని ఒప్పించాలని కోరారు. శిబిరంలో ఇంటక్ నాయకులు, సభ్యులు కూర్చున్నారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, వి.రామ్మోహన్‌కుమార్, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న రాజశేఖర్

నిత్య ధ్యానంతో ఆత్మజ్ఞానం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : నిరంతర ధాన్యం చేస్తేనే ఆత్మ జ్ఞానం కలుగుతుందని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధి టి. రాజ్యలక్ష్మి అన్నారు. పెదగంట్యాడ ఉక్కు సీడబ్ల్యూసీలో బుధవారం అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... యాంత్రిక జీవనానికి ధ్యాన పద్ధతులు ఎంతగానో ఉపశమనం కలిగిస్తాయన్నారు. కేంద్రాల సభ్యులు రేవతి, దేవి, వనిత, పద్మావతి, భానుమతి, దేవిక పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి; హాజరైన సభ్యులు

• అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 90వ వార్డు శ్రీనివాస్‌నగర్‌లో సుమారు రూ. 19.71 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు బుధవారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. ప్రజా పనుల విభాగం ఈఈ రత్నాకర్, ఏఈ వెంకటలక్ష్మి, వార్డు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గాజువాక సినిమాలు..

కన్య: దేవర, శ్రీకన్య, లక్ష్మి, హెవెన్, అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం): వేట్టయన్, మోహినీ 70ఎంఎం: కలి, లక్ష్మీకాంత్: స్వాగ్, మినీ మోహినీ: కళింగ, మోహినీ: మత్తు వదలరా-2, విశేష్: రామ్‌నగర్ బన్నీ

గోపాలపట్నంలో: శ్రీనరసింహా : దక్షిణ నరసింహా: సత్యం సుందరం, సౌజన్య: స్వాగ్ సుకన్య: దేవర, మౌర్య : కలి